జాతీయ దినపత్రిక

Postal Licence No. L/KNL/3-52(D) 2018 - 2020

# ఉదయం న్యూస్

ఎడిటర్ : సి. శేఖర్ యం

Published from Kurnool ---- Circulated by Andhrapradesh, Telangana & New Delhi

సంపుటి :04 సంచిక :208 పేజీలు 8 వెల : 5 శనివారం 09 మే 2026



విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో

మరో సంచలనం

వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ఆదరణ పొందుతున్న ఉదయం తెలుగు దినపత్రికకు మరియు UM TV కేబుల్ Tv చానల్ కు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ల నందు పనిచేయుటకు జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు నియోకవర్గాల వారిగా ఆర్.సి.ఇన్‌చార్జిలు మండలాల వారిగా విలేకరులు కావలెను

జాతీయ దినపత్రిక ఉదయం న్యూస్ UM TV

Contact : 94401 40418, 63038 17489




## రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

నగరంలో వరుస హత్యలు ఆందోళనకరం

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు

2లో..

# తమిళనాడు ఉత్కంఠకు తెర



- నేడు సిఎంగా విజయ్ ప్రమాణం
- మద్దతుల లేఖలతో గవర్నర్‌రోత్తో మరోమారు భేటీ
- ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌కు గవర్నర్ అనుమతి
- 11 గంటలకు నెహ్రూ స్టేడియంలో ప్రమాణ కార్యక్రమం
- కాంగ్రెస్, లెఫ్ట్ తదితర పార్టీల మద్దతు లేఖలు సమర్పణ
- టివికె కూటమి బలం 120కి చేరిక..మద్దతుపై అనేక

ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు.

2లో..



2లో..

అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది.

# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

మూసీతో నగరరూపు రేఖలు మారుతాయి

స్వచ్ఛమైన వాతావరణం ఏర్పడుతుంది

అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేస్తున్నాం

ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయండి

జనంలో విశ్వసనీయత కల్పించేలా కార్యాచరణ

ఉన్న నిర్మాణాలపై తక్కువ ప్రభావం పడేలా అలైన్‌మెంట్

కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో డిప్యూటి సిఎం భట్టి

మూసీ తొలిదశ పనులకు 7,055 కోట్లు తొలిదశలో హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్ వరకు గ్రీన్ సిగ్నల్ తొలి 5 కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశం ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ద్వారా నిధులు కేబినేట్ సబ్‌కమిటీ భేటీలో నిర్ణయం



2లో..

## చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం

మహనీయుల కలలు సాకారం చేస్తాం

దశాబ్దాలుగా భయం గుప్పిట్లో బెంగాల్

గో అక్రమ రవాణాకు కళ్లెం వేస్తాం

చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం




# ఎస్సీలతో పాటు బుడగజంగాలకు సంక్షేమ పథకాలు

వారందరికి గృహ వసతి కల్పించాల్సిందే

ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు

2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం

కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు దిశానిర్దేశం

అమరావతి: ఎస్సీలకు కలిగే ప్రతి లబ్దిని బుడగ జంగాలకు వర్తింప చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలని సీఎం ఆదేశించారు. డిసెంబర్ నాటికల్లా మరో 2.38 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు జరగాలన్నారు. 2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సమావేశంలో వివిధ సంక్షేమ శాఖలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, హౌసింగ్ వంటి అంశాలపై సీఎం సమీక్ష నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల పట్టాల పంపిణీ, క్రమబద్ధీకరణ వంటి అంశాలపై కలెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 2 లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా వేసినట్లు సీఎం తెలిపారు. 3 సెంట్లు గ్రామాలు, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉందన్నారు. లబ్దిదారులు అంగీకరిస్తే.. ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సూచించారు. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్దీకరించాలని ఆదేశించారు. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కేబినెట్‌కు పంపాలని... ఆమోదిస్తామన్నారు. ఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి చేయగలిగితే.. విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. గుంటూరులో 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. బుడగ జంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉందని.. దీనిపై కేంద్రంతో మాట్లాడతామన్నారు. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడ గజంగాలకు వర్తించేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో

బీసీ కులాల వెనుకబాటుతనం అధ్యయనం చేయడానికి ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. బీసీ హాస్టళ్లల్లో ఆర్వో యూనిట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామని.. హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. ముస్లిం జనాభా ఉన్న చోట 175 నియోజకవర్గాల్లోనూ రూరల్ ఆటోనగర్‌లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామికవాడ సిద్ధం అవుతుందని అన్నారు. వక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామికవాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలన్నారు. లైవ్ లీ హుడ్ హబ్‌లుగా వీటిని అభివృద్ధి చేయాలని సూచించారు. జలధార, పశుగ్రాసం సహా వివిధ కార్యక్రమాలను కేంద్ర పథకాలతో ఇంటిగ్రేట్ చేసి అమలు చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

## రాయలసీమ కాదు... రాయల్ సీమ

### రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ఎక్స్‌లో బాబు పోస్ట్




అమరావతి: ఏపీకి ప్రపంచ ప్రఖ్యాత ఐకానిక్ మోటార్ సైకిల్ బ్రాండ్ 'రాయల్ ఎన్‌ఫీల్డ్' రాబోతోంది. తిరుపతిలో రూ.2,500 కోట్లతో మోటర్ సైకిల్ తయారీ పరిశ్రమను రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్ రాకపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'రాయలసీమ ఇప్పుడు రాయల్‌సీమ' అనే టైటిల్‌తో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ ఉన్న ఫొటోను సీఎం చంద్రబాబు షేర్ చేశారు. ఈ ఫొటోకి 'రాయలసీమకు దూసుకువస్తున్న రాయల్ ఎన్‌ఫీల్డ్' అంటూ క్యాప్షన్ పెట్టారు. రెండు రోజుల క్రితం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 17వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు(ఎస్ఐపీబీ).. రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ పరిశ్రమకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్ట్ కోసం సత్యవేడు పరిధిలోని వన్నెలూరు, రాళ్లకుప్పం గ్రామాల్లో సుమారు 267 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది. ఈ పరిశ్రమ ద్వారా సుమారు 5,000 మంది యువతకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. గురువారం జరిగిన కలెక్టర్ల సమావేశంలోనూ ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ రావడంపై సీఎం చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. కాలేజీ రోజుల్లో బు÷-లలెట్ బండి నడిపిన సంగతులను సీఎం గుర్తుచేసుకున్నారు. 'కాలేజీ రోజుల్లో రాయల్ ఎన్‌ఫీల్డ్ డ్రైవ్ చేశా.. ఇప్పుడు ఆ సంస్థను ఏపీకి తెచ్చాం' .

## ప్రధాని పర్యటన తరవాత రాజకీయ మార్పులు

### బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు



హైదరాబాద్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు తెలిపారు. ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు.



## కృష్ణానగర్ వరదకు పరిష్కారం చూపుతాం

హైదరాబాద్: రాజధానిలో వర్షాకాలం వచ్చిందంటే రోడ్ల పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. అసలే ట్రాఫిక్, ఉప్పొంగే డ్రైనేజీలు.. తెరుచుకుని ఉండే మ్యాన్ హోల్స్ వెరసి వాహనదారులకు నరకప్రాయంగా ఉంటుంది. ఇక కృష్ణానగర్ నగర్ గురించి ఎంత చెప్పినా తక్కువే... చిన్నపాటి వర్షానికే రోడ్ల మీద డ్రైనేజీ ఉప్పొంగి ప్రవహిస్తూ వరదను తలపిస్తుంటుంది.

# తెలంగాణకు కేంద్ర సహకారంపై చర్చకు సిద్ధం

కాంగ్రెస్, బిఆర్ఎస్‌లు విమర్శలు మానితే మంచిది కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు. ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ. 9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు. గవర్నర్ చర్యలను బిజెపికి అంటగట్టి విమర్శించడం మానుకోవాలన్నారు.

ఉదయం న్యూస్
ఎడిటర్ : సి. శేఖర్ యం

# మూసీ ప్రక్షాళన సామాజిక బాధ్యత

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తిస్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాల పై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవనప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి - ప్రజా హితం' రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశర చేసింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ లతో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ -1 సుమారు 7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి నిధులు సమకూర్చు కునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ -1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్



నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ఫ్లా÷ల్గ÷లింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్-టు-వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి -గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకొవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తి చేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్ ను సమర్పించాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశిరచుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి, జెఎన్ టియూ సంస్థల నుంచి తగిన సహకారం తీసుకోవాలని సూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగాంగ నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్ లో మంత్రులు ఆసక్తిగా తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు.

ఈ సమావేశంలో మెట్రో పాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సీఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు ఉత్కంఠకు తెర

చెన్నైతమిళనాట ఉత్కంఠకు తెరపడింది. టివికె అధినేత విజయ్ నేడు సిఎంగా ప్రమాణం చేయబోతున్నారు. వివిధ పార్టీల మద్దతు లేఖలు గవర్నర్‌కు సమర్పించడంతో ప్రభుత్వం ఏర్పాటుకు మార్గం సుగమం అయ్యింది. తమిళనాడులో ఏకైక పెద్ద పార్టీగా నిలిచిన విజయ్ సారథ్యంలోని టీవీకే తొలిసారి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. మెజారిటీకి అవసరమైన సంఖ్యాబలంతో గవర్నర్ ఆర్వీ అర్లేకర్‌ను విజయ్ రాజ్‌భవన్‌లో శుక్రవారం సాయంత్రం కలిశారు. ఎమ్మెల్యేల మద్దతు లేఖను ఆయనకు అందజేశారు. ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాల్సిందిగా కోరారు. దీంతో సంతృప్తి చెందిన గవర్నర్ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు అనుమతించారు. మరోవైపు కొత్త ప్రభుత్వం ప్రమాణస్వీకారానికి ఏర్పాట్లు చురుగ్గా జరుగుతున్నాయి. శనివారం ఉదయం 11 గంటలకు చెన్నైలోని నెహ్రూ స్టేడియంలో ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. మే 4న అసెంబ్లీ ఫలితాలు వెలువడిన అనంతరం గవర్నర్‌ను విజయ్ కలవడం ఇది మూడోసారి. విజయ్ రెండు చోట్ల గెలవడంతో టీవీకేకు 107 మంది ఎమ్మెల్యేల సంఖ్యా బలం ఉంది. అయితే ప్రభుత్వ ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరమైంది. ఐదుగురు ఎమ్మెల్యేలున్న కాంగ్రెస్ టీవీకేకు మద్దతు ఇవ్వడంతో ఆ బలం 112కు చేరింది. ఈ క్రమంలో ఇద్దరేసి ఎమ్మెల్యేలున్న వీసీకే, సీపీఐ, సీపీఎం సైతం బేషరుతుగా టీవీకేకు మద్దతివ్వాలని నిర్ణయం తీసుకున్నాయి. దీంతో మెజారిటీ అవసరమైన 118 మంది సభ్యుల బలం టీవీకే సంపాదించగలిగింది. దీనికితోడు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్న ఐయూఎంఎల్ కూడా టీవీకేకు మద్దతు ప్రకటించింది. దీంతో టీవీకేకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల బలం 120కి చేరుకుంది. తమిళనాడులో విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం ప్రభుత్వం కొలువుదీరడానికి అడుగులు పడుతున్నా.. మిత్రపక్షాల షరతులు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి. అటు కాంగ్రెస్, ఇటు వామపక్షాలు వీసీకే తమ మద్దతుకు సంబంధించి కీలక ప్రకటనలు చేశాయి. విజయ్ ప్రభుత్వంలో భాగస్వామ్యంపై వామపక్షాలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. టీవీకే ప్రభుత్వానికి తాము కేవలం బయటి నుంచే మద్దతు ఇస్తామని.. కేబినెట్‌లో చేరే ఉద్దేశం లేదని లెఫ్ట్ పార్టీలు ప్రకటించాయి. ప్రస్తుత రాజకీయ అనిశ్చితిని తొలగించి, ఒక సెక్యులర్ ప్రభుత్వం ఏర్పాటు కావాలన్న ఉద్దేశంతోనే విజయ్‌కు మద్దతు ఇస్తున్నట్లు వారు తెలిపారు. ఇక, టీవీకేకు ముందుగానే మద్దతు ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ.. విజయ్‌కు ఒక కీలకమైన షరతు విధించింది. భవిష్యత్తులో టీవీకే ఎట్టి పరిస్థితుల్లోనూ మతతత్వ పార్టీలతో చేతులు కలపకూడదని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ షరతుకు లోబడి ఉంటేనే.. తమ 5 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉంటుందని హైకమాండ్ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత కీలకమైన 2 స్థానాలు కలిగిన విడుతలై చిరుతైగల్ కట్చి అధినేత తోల్ తిరుమావళవన్ తనదైన వ్యూహాన్ని తెరపైకి తెచ్చారు. వచ్చే ఉపఎన్నికల్లో తిరుచ్చి ఈస్ట్ నియోజకవర్గాన్ని తమకు కేటాయించాలని ఆయన షరతు పెట్టారు. తిరుమావళవన్ స్వయంగా తిరుచ్చి ఈస్ట్ నుంచి అసెంబ్లీకి పోటీ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ స్థానం ఇస్తేనే టీవీకేకు మద్దతుపై తుది సంతకం చేసే అవకాశం ఉంది.వామపక్షాలు కేబినెట్‌లో చేరకపోవడం వల్ల విజయ్ తన సొంత పార్టీ ఎమ్మెల్యేలకే ఎక్కువ మంత్రి పదవులు ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. కానీ, తిరుమావళవన్ కోరుతున్న 'తిరుచ్చి ఈస్ట్' స్థానం విషయంలో విజయ్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతిభద్రతలు

హైదరాబాద్: రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో శాంతిభద్రతలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ఘోరమైన నేరాల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ యంత్రాంగం మొత్తాన్ని రాజకీయ కక్షసాధింపులు, ప్రతిపక్ష నాయకులను వేధించడం కోసమే మళ్లించడం వల్లనే, ప్రజల రక్షణ, భద్రత గాలిలో కలిసిపోయిందని విమర్శించారు. శాంతిభద్రతల క్షీణతపై బీఆర్ఎస్ ప్రతినిధి బృందం డీజీపీని కలిసి ఫిర్యాదు చేస్తున్న సమయంలోనే అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే హైదరాబాద్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ ర్యాంక్ ఐపీఎస్ అధికారి వినయ్ రంజన్ రాయ్ భార్య అత్యంత దారుణంగా హత్యకు గురైన వార్త రావడం దిగ్భ్రాంతికరమని పేర్కొన్నారు. అంతేకాకుండా, నిన్న రాత్రి సికింద్రాబాద్‌లో నడిరోడ్డుపై ఒక యువకుడిని అతి దారుణంగా కత్తితో పొడిచి చంపిన ఘటన నగరాన్ని ఉలిక్కిపడేలా చేసిందని, ఇది సామాన్య పౌరుల్లో పెరుగుతున్న అభద్రతా భావానికి అద్దం పడుతోందని స్పష్టం చేశారు. నేరాల నివారణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టాల్సిన పోలీస్, ఇంటెలిజెన్స్ వ్యవస్థలను కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వ తీరును విమర్శించే సోషల్ మీడియా గొంతులపై అక్రమ కేసులు బనాయించేందుకు వాడుకుంటోందని ఆరోపించారు. 'పోలీస్ వ్యవస్థను రాజకీయ కక్షసాధింపు చర్యలకు వాడుకోవడం వల్లనే శాంతిభద్రతలు కుప్పకూలాయని' స్పష్టం చేశారు. తెలంగాణలో మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాలు భారీగా పెరిగినట్లు తాజా ఎన్‌సీఆర్‌బీ నివేదికలు చెబుతున్నాయని, ఇది ప్రస్తుత ప్రభుత్వ పాలనా వైఫల్యానికి నిదర్శనమని కేటీఆర్ గుర్తుచేశారు. హోం శాఖను కూడా తన వద్దే ఉంచుకున్న రేవంత్ రెడ్డి ప్రజల ఆస్తిపాస్తులను, ప్రాణాలను రక్షించడంలోనూ, శాంతిభద్రతలను కాపాడటంలోనూ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే రాజకీయ వేధింపులు ఆపి, పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, ప్రజల్లో భరోసా కల్పించేలా వ్యవహరించాలని ఆయన డిమాండ్ చేశారు.

# చొరబాటు దారులను పూర్తిగా తరిమికొడతాం




కోల్‌కతా: సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బీజేపీపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా క్లళెం వేస్తామని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ బీజేపీ శానసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా శుక్రవారంనాడు ప్రకటించారు. 'కాబోయే సీఎం'గా సువేందును అభివర్ణించారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బీజేపీ కార్యకర్తలందరి బాధ్యత అన్నారు. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు. బెంగాల్ లెజిస్లేటివ్ పార్టీ నేత ఎన్నిక ప్రక్రియను పర్యవేక్షించేందుకు కేంద్ర పరిశీలకుడిగా అమిత్‌షా శుక్రవారంనాడు హాజరయ్యారు. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో సువేందు అధికారిని బీజేపీ లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. ఈనెల 9వ తేదీన కోల్‌కతాలోని బ్రిగేట్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే కార్యక్రమంలో బీజేపీ ప్రభుత్వం ప్రమాణస్వీకారం చేయనుంది. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ... కమ్యూనిస్ట్ పాలన నుంచి బెంగాల్‌లో భయం, హింసాత్మక వాతావరణం ఉందని, ఇది ఆ తర్వాత తీవ్రంగా మారిందని అమిత్ షా ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో బెంగాల్ ప్రజలు బీజేపీకి మద్దతుగా నిలిచారని అన్నారు. ప్రజలు ఆకాంక్షలకు అనుగుణంగా 'సోనార్ బంగ్లా' లక్ష్యంతో ముందుకు సాగుతామని చెప్పారు. బెంగాల్ భయం రహిత సమాజం దిశగా వెళ్తుందని అన్నారు. గత 5 దశాబ్దాలుగా బెంగాల్ శాంతిభద్రతలు, ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ పరంగా తీవ్రమైన ప్రతికూల రాజకీయాలను చూసిందని.. బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం ఇప్పుడు బీజేపీ బాధ్యత అని అన్నారు. బెంగాల్ సంస్కృతి, సంప్రదాయాలను బలోపేతం చేస్తూ, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద, శ్రీ అరబిందో, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి వారు కోరుకున్న బెంగాల్ రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని అన్నారు. ఈ విజయం చాలా ముఖ్యమైందని, 1950లో ప్రారంభమైన సైద్ధాంతిక ప్రయాణం నేడు బెంగాల్‌కు చేరుకుందని, శ్యామా ప్రసాద్ ముఖర్జీ జన్మస్థలంలో బీజేపీ ప్రభుత్వం కొలువుదీరుతుండటం ఒక చారిత్రక ఘట్టమని చెప్పారు. 2014లో ప్రారంభమైన బీజేపీ ప్రస్థానం ఇపుడు గంగోత్రి నుంచి గంగాసాగర్ వరకు చేరిందని ఉత్తరాఖండ్ నుంచి బెంగాల్ వరకు బీజేపీ ప్రభుత్వాలే ఉన్నాయని చెప్పారు. ఈ విజయం కోసం 321 మంది బీజేపీ కార్యకర్తలు తమ ప్రాణాలను కోల్పోయారని, ఈ విజయం సులభంగా రాలేదని అమిత్ షా వెల్లడివంచారు. త్రిపుర,

అస్సాం, బెంగాల్‌లలో బీజేపీ ప్రభుత్వాలు ఏర్పడటంతో సరిహద్దు భద్రతను మరింత పెరుగుతుందని, అక్రమ రవాణా, చొరబాట్లను కఠినంగా అణిచివేస్తామని ఆయన చెప్పారు. దేశవ్యాప్తంగా చొరబాటుదారుల్ని గుర్తించి వారిని తరిమివేసి, చొరబాటురహిత దేశంగా మారుస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మమతా బెనర్జీని ఆమె సొంత ఇంటిలో భవానీపూర్‌లో ఓడించి శక్తివంతమైన సందేశాన్ని పంపినట్లు అమిత్ షా చెప్పారు. ఈ విజయంతో బీజేపీపై మరింత బాధ్యత పెరిగిందని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత హింస, కక్షపూరిత రాజకీయాలకు తావు ఉండకూడదని కార్యకర్తల్ని కోరారు. ఉదయం కోల్‌కతా చేరుకున్న అమిత్ షా ప్రఖ్యాత దక్షిణెశ్వర్ కాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి సేవల పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి గుండాలతో దాడిచేయిస్తారా?

హైదరాబాద్: శాంతిభద్రతలను కాపాడాల్సిన కేంద్ర హోంమంత్రి గూండాలను పంపి దాడులు చేయిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ నాయకులపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. డీజీపీని కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, దేశపతి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ దాడులకు సీఎం రేవంత్ రెడ్డి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యాలయమైన క్యాంప్ ఆఫీసులపై దాడి చేశారని తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, హుజూరాబాద్, మల్కాజిగిరిలో దాడులు చేశారని పేర్కొన్నారు. బాహాటంగా బీజేపీ గూండాలు దాడులకు తెగబడ్డారని అన్నారు. వాళ్లు దాడులు చేస్తుంటే పోలీసులు అదుపు చేయకుండా చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో శాసనసభ్యులకే రక్షణ లేకుండా పోయిందని దేశపతి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. దేశం కోసం ధర్మం కోసం అని చెప్తూ పుట్టుక గురించి మాట్లాడతారా? ఇంత కుసంస్కారమా అని బండి సంజయ్ తీరుపై దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. బండి సంజయ్ నోటి నుంచి ఒక శ్లోకం వినలేదని తెలిపారు. ప్రజలకు అవసరం వచ్చే మాట ఒక్కటి కూడా వినలేదని పేర్కొన్నారు. పొద్దున లేస్తే కేటీఆర్, కేసీఆర్ లను తిట్టడం తప్ప ఏం చేతకాదని విమర్శించారు. రేవంత్ రెడ్డి, బండి సంజయ్ కలిసి ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డీజీపీని కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. చట్టప్రకారం వారిపై చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ఇకపోతే బండి సంజయ్, రేవంత్ రెడ్డి మధ్య చీకటి ఒప్పందం ఉందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆపద వచ్చినప్పుడల్లా బండి సంజయ్ కాపాడుతున్నాడని తెలిపారు. కరీంనగర్ దాడి వెనుక రేవంత్ రెడ్డి సహకారం ఉందని ఆరోపించారు. 2014కు ముందు బండి సంజయ్ చందాలతో బతికేవాడని అన్నారు. కానీ ఇప్పుడు అహంకారపూరితంగా మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. మీరు మాట్లాడిన భాషలోనే మీకు సమాధానమిచ్చామని తెలిపారు. పాడి కౌశిక్ రెడ్డిపై పథకం ప్రకారమే దాడి జరిగిందని కేపీ వివేకానంద తెలిపారు. కౌశిక్ రెడ్డిపై హత్యకు సామాగ్రితో వచ్చారని పేర్కొన్నారు. ఇలాంటి సంస్కృతిని కొనసాగిస్తే.. రెండున్నరేళ్ల తర్వాత బండి సంజయ్ గుజరాత్, యూపీకి వెళ్లి బతకాల్సి వస్తుందని హెచ్చరించారు. పదేళ్లలో తాము ఎంతో ఓపికగా ఉన్నామని తెలిపారు. అన్ని ఆధారాలతో డీసీపీకి ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. పాడి కౌశిక్ రెడ్డి కారు ధ్వంసం కేసులో బండి సంజయ్‌ను ఏ1గా చేర్చాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్‌పై పరువు నష్టం దావా వేస్తామని తెలిపారు.

# దేశం గర్వించేలా కొడంగల్ అభివృద్ధి



కొడంగల్: దేశం మొత్తం కొడంగల్ వైపు చూసేలా అభివృద్ధి చేస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొడంగల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తామని ఉద్ఘాటించారు. అందరి సహకారంతో రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడుపుతున్నామని తెలిపారు. పేదల సంక్షేమం కోసం తాము పనిచేస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. శుక్రవారం వికారాబాద్ జిల్లాలోని సొంత నియోజకవర్గం కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. 430 పడకల ఆస్పత్రి నిర్మాణం, దౌల్తాబాద్ వేంకటేశ్వర ఆలయం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి, పలువురు నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ శ్రీ మహలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం చేయటం అదృష్టమని చెప్పుకొచ్చారు. తెలంగాణ పేదల తిరుపతిగా ఈ ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఓవైపు గుడి.. మరోవైపు గడి ఏకమైన ఈ నియోజకవర్గాన్ని నందనవనంగా మార్చటానికి అందరు కలిసి రావటం అభినందనీయమని తెలిపారు. ఆగమశాస్త్ర పండితుడు సుందరవరదాచార్యులు కలలుగన్న గుడి నిర్మాణం సహకారం కావటం సంతోషమని చెప్పారు. తిరుపతిలో ఏ రకమైన పూజలు జరుగుతాయో ఇక్కడ అలాగే పూజలు జరుగుతాయని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ గుడికి కర్ణాటక, మహరాష్ట్ర నుంచి భక్తులు వస్తారని.. దీంతో కొడంగల్‌కు దేశంలో గుర్తింపు వస్తోందని తెలిపారు. కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని తెలిపారు ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి నిధుల కొరత లేదన్నారు. ఈ ఎత్తిపోతల పథకానికి భూసేకరణ పూర్తయిందని.. అనుమతులు వచ్చాయని, ఏడాదిన్నరలోపు పూర్తి చేద్దామని చెప్పుకొచ్చారు. కృష్ణానదీ జలాలతో కొడంగల్ భూములు తడవాలన్నారు. కృష్ణా జలాలు ఇక్కడికి వచ్చే వరకు జిల్లా ఇన్చార్జి మంత్రి దామోదర రాజనర్సింహ, మంత్రి శ్రీహరిని నిద్ర పోనీయొద్దని స్థానిక నేతలకు సూచించారు. కొడంగల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ నియోజకవర్గానికి ఇప్పటి వరకు ఒక్కసారి కూడా మంత్రి పదవి దక్కలేదని, ఇప్పుడు కొడంగల్ ఎమ్మెల్యేనైన తనకు సీఎం పదవి దక్కిందన్నారు. కొడంగల్ నుంచే దౌల్తాబాద్, కోస్గి ఆలయాల అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు.కృష్ణ- వికారాబాద్ రైల్వేలైన్ త్వరలో పూర్తవుతుందని స్పష్టం చేశారు. రేకులపాడు ప్రాంతంలో సిమెంట్ పరిశ్రమలను ఆరు నెలల్లో ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తామని అన్నారు. 20 ఎకరాల్లో లగచర్ల వద్ద విద్యాహబ్‌గా మార్చుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఇక్కడ అనేక విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాజకీయాలు ఎన్నికల సమయంలో ఉండాలని.. ఆ తర్వాత అందరం కలిసి పనిచేయాలని సూచించారు. 2034 వరకు గుంపులు, గ్రూపులు పక్కన పెట్టాలని.. అభివృద్ధికి బాటలు వేద్దామని పిలుపునిచ్చారు.

# ఉన్నత విద్యకు వెళ్లే వారికి అండ

అమరావతి:దేశ విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి వెళ్లే విద్యార్థులకు పావలా వడ్డీకే విద్య రుణాలు అందించాలని జిల్లా కలెక్టర్లను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. విద్యార్థుల ఉన్నత విద్యను ప్రోత్సహించడమే లక్ష్యమని అన్నారు. చాలామంది రుణాలు అందక చదువుకలేక పోతున్నారని, అలాంటి వారికి అండగా నిలవాల్సి ఉందన్నారు. శుక్రవారం రాజధాని అమరావతిలో జిల్లా కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలతోపాటు తల్లికి వందనం, సంక్షేమంపై అధికారులకు సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. అలాగే పథకాల అమలు, లబ్దిదారుల ఇంటిగ్రేషన్‌పై వారికి సీఎం దిశానిర్దేశర చేశారు. అన్నదాత సుఖీభవ, దీపం 2.0, స్త్రీ శక్తి, దివ్యాంగశక్తి పథకాలపై చర్చించారు. దీపం-2.0 పథకం కింద 1.08 కోట్ల మంది లబ్దిదారులు ఉన్నారని తెలిపారు. దీపం-2.0 పథకానికి ఇప్పటి వరకు రూ.3,504 కోట్లు ఖర్చు చేసినట్లు వివరించారు. స్త్రీ శక్తి కోసం ఏడాదికి రూ.1,940 కోట్ల ఖర్చు అవుతుందని చెప్పారు. తల్లికి వందనం కింద 67 లక్షల మందికి రూ.10 వేల కోట్లు ఖర్చు చేస్తున్నట్లు వివరించారు. ఏజెన్సీల్లో కాఫీ, పసుపు, కుంకుమపువ్వు సాగుకు ప్రోత్సాహం ఇస్తున్నట్లు ప్రకటించారు. అరకు కాఫీకి గ్లోబల్ బ్రాండ్ తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. జిల్లా కలెక్టర్‌ల సమావేశం గురువారం రాజధాని అమరావతిలో ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశం సాయంత్రం ముగిసింది.

## కేంద్రమంత్రి గుండాలతో దాడిచేయిస్తారా?

హైదరాబాద్ శాంతిభద్రతలను కాపాడాల్సిన కేంద్ర హోంమంత్రి గూండాలను పంపి దాడులు చేయిస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. కరీంనగర్‌లో ఎమ్మెల్యే గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంపై దాడి చేసి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కారును ధ్వంసం చేసిన బీజేపీ నాయకులపై రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. డీజీపీని కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, కేపీ వివేకానంద, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, దేశపతి శ్రీనివాస్ వినతిపత్రం అందజేశారు. అనంతరం దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ దాడులకు సీఎం రేవంత్ రెడ్డి వత్తాసు పలుకుతున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ కార్యాలయమైన క్యాంప్ ఆఫీసులపై దాడి చేశారని తెలిపారు. సిద్దిపేట, గజ్వేల్, హుజూరాబాద్, మల్కాజిగిరిలో దాడులు చేశారని పేర్కొన్నారు.

# గ్రామంలోకి రాకుండా హిజ్రాలపై నిషేధం.?

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



తెలంగాణలో హిజ్రాల ఆగడాలు శ్రుతిమించడంతో నిజామాబాద్ జిల్లా భీమగల్ మండలం బడా భీమగల్ గ్రామ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నారు. వారు ఊర్లోకి రాకుండా నిషేధం విధిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ విడిసి తీర్మానం చేసింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు,ఇతర శుభకార్యాల సమయంలో రూ.వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మరి మీ ఏరియాలోనూ హిజ్రాల ఇబ్బందులు ఉన్నాయా..ఉంటే ఈ నిర్ణయం తీసుకోండి.

# అనారోగ్యంతో గ్రామపంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ కృష్ణ మృతి

**హోళగుంద ఉదయం న్యూస్**





మండల కేంద్రంలో శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్ గా విధులు నిర్వహిస్తున్న చలువాది కృష్ణ రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేజర్ గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి చక్రవర్తి మృతుడి నివాసానికి చేరుకుని పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.అలాగే మట్టి ఖర్చుల కోసం మృతుడి భార్యకు రూ.10,000/- నగదు అందజేశారు. మేజర్ గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు

# బిజెపి జిల్లా జనతా వారధి కార్యక్రమంలో ఎమ్మిగనూరు పట్టణ సమస్యలపై వినతి పత్రం

**ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి**



ఎమ్మిగనూరు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు, రాష్ట్ర పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "జనతా వారధి" కార్యక్రమం ఈరోజు కర్నూలు నగరంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రజలకు -- ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ, ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఇందులో భాగంగా ఈరోజు జిల్లా అధ్యక్షులు అక్కమ్మ తోట రామకృష్ణ గారికి, మరియు జనతా వారధి కన్వీనర్ మాజీ ఎమ్మెల్యే మురళీకృష్ణ గారికి పట్టణ అధ్యక్షులు ఎ+ూ దయాసాగర్ గారు ఎమ్మిగనూరు పట్టణ సమస్యలపై వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గారు మాట్లాడుతూ నాయకులు ప్రజల సమస్యల పరిష్కారమే బీజేపీ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రజలకు మరింత చేరువ కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శిల్పా ఎస్టేట్ ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు, పట్టణ ప్రధాన కార్యదర్శి చేనేత శివ పాల్గొన్నారు.

# రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య కేసు: సంచలన విషయాలు వెల్లడించిన సీపీ సజ్జనార్

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



జూబ్లీహిల్స్‌లోని ప్రశాసన్ నగర్‌లో రిటైర్డ్ డీజీ వినయ్ రంజన్ రాయ్ సతీమణి తనూజ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ వీసీ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ డీజీ సతీమణి తనూజ హత్య గావింపబడిందని తమకు మొదటగా సమాచారం వచ్చిందని తెలిపారు. రిటైర్డ్ డీజీ భార్య తనూజను గురువారం రాత్రి రెండు గంటలకు దుండగులు హత్య చేశారని చెప్పుకొచ్చారు. నేపాలి గ్యాంగ్ పనిగా ప్రాథమికంగా తాము ఒక అంచనాకు వచ్చామని అన్నారు. కొన్ని క్లూస్ లభించాయని..ఆ క్లూస్ ఆధారంగా ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. నేపాలి పనివాళ్లపై అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పనిమనిషి కల్పన ఈ హత్య చేసిందినేపాలి పని మనుషులు ఇంట్లో ఎవరూ లేనప్పుడు నేరాలకు పాల్పడుతున్నారని సీపీ సజ్జనార్ చెప్పుకొచ్చారు. గురువారం రాత్రి రిటైర్డ్ డీజీ ఇంట్లో ఎవరు లేనప్పుడు పనిమనిషి కల్పన అనే మహిళ మరికొందరితో కలిసి ఈ క్రైమ్ చేసిందని తెలిపారు. నిందితులు వెనుకాల గేటు నుంచి ఇంట్లోకి ప్రవేశించారని పేర్కొన్నారు. ఈ ఘటన సమయంలో పిల్లలు ఇద్దరు పై ఫ్లోర్‌లో ఉన్నారని..తనూజ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్నారని వెల్లడించారు.ఇంట్లో ఉన్న పనిమనిషి కల్పనాతో బయట వ్యక్తులు కాంటాక్ట్ పెట్టుకొని ఈ క్రైమ్ చేశారని చెప్పారు. ప్రజలు భయాందోళనకు గురికావొద్దని.
.నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.

# రైతులకు వ్యవసాయానికి కావలసిన పనిముట్లు ఇవ్వటానికి ప్రభుత్వం అనుమతి వచ్చింది కావలసినవారు మీ సేవలో దరఖాస్తు చేసుకోండి

**ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి**



ఎమ్మిగనూరు మండల రైతులకు తెలియజేయడమేమనగా రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి ప్రభుత్వం నుండి అనుమతి వచ్చినది కావున పనిముట్లు కావలసిన రైతులు మీ రైతు సేవ కేంద్రంలో దరఖాస్తు అప్లై చేసుకోవలెను 5 వ తేదీ నుండి 19 వ తేదీ వరకు దరఖాస్తు సమర్పణ,
20 తేదీ నుండి 22 వా తేదీ వరకు రైతులు మార్పులు చేర్పులు ప్రక్రియ,
23 తేదీ నుండి 25వ తేదీ వరకు లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను జిల్లా ఇన్చార్జి మంత్రి ఆమోదంతో లాటరీ ప్రక్రియ ద్వారా దరఖాస్తుదారులను ఎంపిక చేయబడును, ఎంపిక చేసిన రైతులను మే 26వ తేదీ నుండి జూన్ 6 వ తేదీ వరకు రైతులకు నాన్ సబ్సిడీ పోర్షన్ కట్టడానికి అవకాశం కల్పిస్తారు, 26-5-2026 వ తేదీ నుండి 26-6-2026 వరకు యంత్ర పరికరాలు రైతులకు డెలివరీ చేస్తారు,
సన్న కారు, ఎస్సీ మరియు ఎస్టీ రైతులకు 50 శాతం సబ్సిడీ, జనరల్ కేటగిరి రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ పనిముట్లు ఇవ్వడానికి అనుమతులు వచ్చాయి..
వ్యవసాయ యంత్ర పరికరాలు ఏవనగా. ట్రాక్టర్ పరికరాలు, విత్తడం, నాటడం, మరియు త్రవ్వే యంత్రాలు, స్ప్రేయర్లు, ట్రాక్టర్లు మరియు మినీ ట్రాక్టర్లు ( 40 హ్సూ లోపు), పవర్ టిల్లర్లు, హార్వెస్టింగ్ నూర్పిడి యంత్రాలు.. తదితర పరికరాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి.

# విద్యార్థులు యువత పినాక ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

**పినాక ఉచిత శిక్షణ తరగతుల కరపత్రాలను ఆవిష్కరించిన ఎమ్మిగనూరు టౌన్ సీ.ఐ కంబగిరి రాముడు,రూరల్ ఎస్.ఐ శ్రీనివాసులు,డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడు.**

**ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి**



ఎమ్మిగనూరు పట్టణంలో పినాక ప్రజా సాధికార ట్రస్టు మరియు విశాఖపట్నం ఇన్కమ్ టాక్స్ కమిషనర్ బి.యాదగిరి,అమీలియో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు నగరంలోని శ్రీలక్ష్మీ హైస్కూల్ లో ఈ నెల 11వ తేదీ నుండి మొదలయ్యే స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్,బ్యాంకింగ్,గ్రూప్స్,సివిల్స్ గైడెన్స్ ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మిగనూరు టౌన్ సీ.ఐ కంబగిరి రాముడు,రూరల్ ఎస్.ఐ శ్రీనివాసులు,డిప్యూటీ తహసీల్దార్ వీరేంద్రగౌడు కోరారు.ఎమ్మిగనూరులోని స్థానిక సీ.ఐ కార్యాలయం మరియు తహసీల్దార్ కార్యాలయాలలో రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర సహయ కార్యదర్శి జీ. నల్లారెడ్డి,మదాసిమదారి కురువ సంఘం రాష్ట్ర నాయకులు మల్లప్ప అద్యక్షతన పినాక ఉచిత శిక్షణ తరగతుల కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. గత 13సంవత్సరాలుగా రాయలసీమ జిల్లాల్లో పినాక ప్రజా సాధికార ట్రస్టు ఆధ్వర్యంలో జరుగుతున్న ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్మెంట్, గ్రూప్స్, సివిల్స్ గైడెన్స్ కోర్సును ఈ సంవత్సరం కర్నూలు నగరంలోని మున్సిపల్ ఆఫీస్ వద్ద ఎన్,ఆర్ పేటలో గల శ్రీలక్ష్మీ హైస్కూల్ లో నిర్వహిస్తున్నారని విద్యార్థులకు ఉచితంగా కోర్సుతో పాటు ఉచితంగా కోర్స్ మెటీరియల్, మధ్యాహ్నం ఉచిత భోజన సదుపాయం, అమ్మాయిలకు ఉచిత హాస్టల్ వసతి ఏర్పాటు చేస్తున్నారని అడ్మిషన్ల కోసం రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు,కోర్స్ డైరెక్టర్ రాయలసీమ రవికుమార్ సెల్:9177764147,9640969891 నెంబర్లను సంప్రదించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో శివన్న,రాముడు,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# పంట కాల్వల పునరుద్ధరణ పనులు -- ఆనందంలో రైతన్నలు

**విజయగాథ - కర్నూలు జిల్లా**

పెద్దటేకూరు పంట కాల్వ పూడికతీత పనులతో రైతులలో చిగురిస్తున్న ఆశలు.కర్నూలు జిల్లాలో సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక కార్యక్రమం 'జలధార-జలహారతి' ద్వారా జిల్లాలోని చెరువులు, కుంటలు పునరుజ్జీవం పోసుకుంటున్నాయి. దశాబ్దాలుగా జిల్లాను వెన్నాడుతున్న కరువు రక్కసిని తరిమికొట్టేందుకు జిల్లా యంత్రాంగం సరికొత్త వ్యూహంతో ముందుకు సాగుతోంది. జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి దిశానిర్దేశంలో 'జలధార-జలహారతి' పథకం అద్భుతంగా రూపుదిద్దుకుంటోంది. సాగునీటి శాఖ అధికారుల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.కర్నూలు జిల్లా, కల్లూరు మండలం, పెద్ద టేకూరు గ్రామములో అధిక కుటుంబాలు వ్యవసాయం, పాలవ్యాపారంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. ఇక్కడికి సమీపములో హెచ్.ఎన్.ఎస్.ఎస్ ప్రధాన కాల్వ వెళ్ళుతున్నప్పటికి అధిక శాతం రైతులు మెట్ట వ్యవసాయమే జీవనాధారంగా చేసుకొని పంటలు పండించుకొంటూ జీవిస్తున్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొని వర్షాలు సకాలంలో కురువక పంటలు సరిగా పండక, పండించిన పంటకు మార్కెట్లో గిట్టుబాటు ధర లభించక రైతన్నలు నష్టాల బాటలో పయనిస్తున్నారు. ఈ సమయంలో గ్రామంలో వి బి జి రామ్ జి పథకం ద్వారా గ్రామాలలోని కుంటల్లో, చెరువుల్లో, వంకల్లో పుడికతీత పనులు చేపట్టుటకు హెచ్.ఎన్.ఎస్.ఎస్ ప్రధాన కాల్వ నుంచి కోటేశ్వర రావు పొలం వరకు కాల్వ పునరుద్ధరణ పనులు రెండు అడుగుల లోతుతో 1200 మీటర్ల పొడవున వి బి జి రామ్ జి పథకం ద్వారా శ్రామికులతో పనులు చేపట్టుటకు రూ.4,48,113/- నిధులు మంజూరు చేశారు. ఈ పనులను జలధార-జలహారతి కార్యక్రమములో భాగంగా శ్రామికులతో చురుకుగా చేయిస్తున్నారు. గ్రామసమీపంలో పనులు కల్పించటంతో ఇటు శ్రామికులు ఆనందంగా ఉదయాన్నే వచ్చి పనులు చేస్తున్నారు. పంట కాల్వ పునరుద్ధరణతో రెండుకార్లు పంటలు పండించుకోవచ్చునని రైతులు ఆనందంగావున్నారు. పంటకాల్వ పూడిపోవడంతో నీరురాక, సాగునీరు పెట్టక పొలాలు వర్షాధారం ద్వారానే మెట్ట పంటలు సాగు చేసుకొనే వారు పెద్దటేకూరు గ్రామ రైతులు. వి బి జి రామ్ జి పథకం ద్వారా జలధార-జలహారతి కార్యక్రమములో పంటకాల్వల పునరుద్ధరణకై పుడికతీత పనులు చేస్తున్నారు. దీంతో కాలవకు ఇరువైపుల వున్న 150 ఎకరాల చిన్న, సన్నకారు రైతుల భూములకు సాగునీరు అందుతుంది. దీంతో ఈ భూముల్లో రెండుకార్ల పంటలు సాగునీటితో పండించుకోవచ్చునని, లాభాలు వస్తాయని ఇక్కడి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

# కనకవీరుడులో తాగునీటి తీవ్రతను తీర్చిన మాజీ ఎంపీ బుట్టా రేణుక

**ఎమ్మిగనూరు ఉదయం న్యూస్ ప్రతినిధి**

నందవరం మండల పరిధిలోని కనకవీడు గ్రామంలో అత్యంత భక్తిశ్రద్ధల మధ్య నిర్వహిస్తున్న శ్రీశ్రీశ్రీ మహాయోగి నాగలక్ష్మమ్మ అవ్వ జాతర మహోత్సవం సందర్భంగా వేలాదిగా తరలివస్తున్న భక్తజనులు, గ్రామ ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంటు సమన్వయకర్త, మాజీ పార్లమెంటు సభ్యురాలు బుట్టా రేణుక మండల ఉపాధ్యక్షులు షైక్ సాహెబ్, పెద్ద ఈరన్న శివ, చంద్రశేఖర్ ఆచారి, వీరేష్, వడ్డే గోపాల్, ప్రతాప్, వీరుపాక్షి, సూరి, సంబమూర్తి, మినిగి వీరేష్ తదితరులు ఆమెకు విన్నవించడం జరిగింది.వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో జాతరకు విచ్చేస్తున్న భక్తజనులకు తాగునీటి కొరత ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని కోరగా, శ్రీమతి బుట్టా రేణుక గారు వెంటనే స్పందించి తన భర్త, బుట్టా సేవా సంస్థ అధినేత శ్రీ బుట్టా శివ నీలకంఠ గారికి విషయం తెలియజేశారు.భక్తుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఆయన సైతం మానవత్వంతో స్పందిస్తూ బుట్టా సేవా సంస్థ ఆధ్వర్యంలో కనకవీడు గ్రామంలో ప్రత్యేకంగా తాగునీటి వాహనాలను ఏర్పాటు చేయించారు. ఈ వాహనాల ద్వారా జాతరకు విచ్చేసిన భక్తజనులకు, గ్రామ ప్రజలకు నిరంతరాయంగా మంచినీటి ట్యాంకర్ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు.ఎండ తీవ్రత మధ్య భక్తజనుల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ సేవా కార్యక్రమంపై గ్రామ ప్రజలు, భక్తజనులు హర్షం వ్యక్తం చేస్తూ శ్రీమతి బుట్టా రేణుక , శ్రీ బుట్టా శివ నీలకంఠ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రజాసేవే ధ్యేయంగా బుట్టా సేవా సంస్థ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.

## మోదీ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయి: రామచందర్‌రావు

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ నెల 10వ తేదీన తెలంగాణలో పర్యటిస్తున్నారని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు నారపరాజు రామచందర్‌రావు వ్యాఖ్యానించారు.ఈ సభ తర్వాత తెలంగాణ రాజకీయాలు మారబోతున్నాయని పేర్కొన్నారు. ఈ సభ ఏర్పాట్లు అన్ని దాదాపు పూర్తి అయ్యాయని చెప్పుకొచ్చారు. పరేడ్ గ్రౌండ్‌లో మోదీ హాజరయ్యే సభ ఏర్పాట్లను శుక్రవారం రామచందర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం..
ఈరోజు నుంచి రెండు రోజులపాటు పరేడ్ గ్రౌండ్ పరిసర ప్రాంతాలు అన్ని కేంద్ర బలగాల అధీనంలోకి వెళ్తాయని వెల్లడించారు. గ్రేటర్ ఎన్నికల ముందు మోదీ సభ జరగడం తమ పార్టీకి కలిసి వచ్చే అంశమని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో మోదీ ప్రాధాన్యం చాలా ఉందని ఉద్ఘాటించారు. రెండు లక్షలకు పైగా మందితో ఈ సభ సక్సెస్ కాబోతుందని అన్నారు. బీజేపీ శ్రేణులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా మోదీ సభ కోసం తరలి వస్తున్నారని తెలిపారు.ఈ సభ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులను ఏర్పాటు చేశామని రామచందర్‌రావు పేర్కొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం...ఎంపీ బస్తిపాటి నాగరాజు



ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం లాంటిదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. గోనెగండ్ల మండలంలోని కుర్నూర్ గ్రామానికి చెందిన శారదమ్మ కు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందిన రూ.51,334 ఆర్థిక సహాయం చెక్కును ఆయన పంచలింగాల గ్రామంలోని తన నివాసంలో అందజేశారు.. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు...

# ప్రధాని మోదీ పర్యటనతో తెలంగాణలో బీజేపీ మరింత బలోపేతం: కిషన్ రెడ్డి

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**



తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి మరోసారి మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అందించిన సహకారంపై వీరిద్దరికి అవగాహన లేనట్లు ఉందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో విలేకరుల సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ. ఈ పన్నెండు ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణ రాష్ట్రానికి అందించిన సహకారంపై తాము ఎప్పుడు చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.
హైదరాబాద్‌లో ప్రధాని మోదీ సభ తరువాత తెలంగాణలో మరింత బలోపేతం అవుతామని కేంద్ర మంత్రి విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ఎన్నికలకు సంబంధించిన కార్యక్రమం కాదన్నారు.ఇది అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. రూ.9 వేల కోట్ల అభివృద్ధి పనులకు మోదీ నేరుగా తెలంగాణలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల కంటే ముందే ప్రధాని మోదీ తెలంగాణ పర్యటన ఖరారు అయిందని చెప్పారు. తమిళనాడులో రాజ్యాంగ బద్ధంగా ఏ ప్రభుత్వం అయినా ఏర్పాటు చేయవచ్చునన్నారు.

# మార్కాపురం పేరుకే! జిల్లా అంత డొల్ల



మార్కాపురం ( మే 8) మార్కాపురం నూతన జిల్లా ఏర్పడి ఐదు మాసాలు పూర్తికావస్తున్న జిల్లాకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పన నేటి వరకు జరగలేదని, వివిధ శాఖల కార్యాలయాలు కూడా ఏర్పాటు కాలేదని, శాంతి భద్రతను కాపాడవలసిన ఎస్పీ పోస్ట్ సైతం ఇప్పటికీ పూర్తి చేయలేదని మార్కాపూర్ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రెవిన్యూ శాఖలో అనేక ఖాళీలు భర్తీ చేయవలసి ఉందని అలాగే విద్య, వైద్యం, పంచాయతీ రాజ్ శాఖలో కూడా ఇన్చార్జి పాలల్లో నడుస్తున్నాయని" పేరుకే మార్కాపూర్ జిల్లా అని అంతా డొల్లని "నేడు మార్కాపూర్ ప్రెస్ క్లబ్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు షేక్ సైదా అన్నారు. మార్కాపురం జిల్లా సాధన కోసం 65 రోజులు పాటు సుదీర్ఘంగా సాగిన ఉద్యమంతో అన్ని రాజకీయ పక్షాలు ప్రజా సంఘాల నాయకత్వంలో జరిగిన ఉద్యమ ఫలితంగా జిల్లాని సాధించుకున్నామని అయితే! జిల్లా సాధించుకున్నాం అనే ఆనందం ఇప్పుడు మార్కాపూర్ ప్రాంతంలో జరుగుతున్న భూకబ్జాలు, ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా, రేషన్ మాఫియా, లిక్కర్ మాఫియా చూసి ఆనందం కాస్త ఆవిరి అయిపోతుంది అని షేక్ సైదా అన్నారు.

# రాష్ట్ర సచివాలయంలో కొనసాగుతున్న 7వ జిల్లా కలెక్టర్ల సమావేశం.

**వివిధ సంక్షేమ శాఖలు, సమ్మర్ యాక్షన్ ప్లాన్, హౌసింగ్ వంటి అంశాలపై సీఎం చంద్రబాబు సమీక్ష.ఇళ్ల నిర్మాణాలు, ఇళ్ల పట్టాల పంపిణీ, క్రమబద్ధీకరణ వంటి అంశాలపై కలెక్టర్ల సమావేశంలో కీలక నిర్ణయాలు.**

**అమరావతి**

ఎస్సీలకు కలిగే ప్రతి లబ్ధిని బుడగ జంగాలకు వర్తింప చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశాలు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. ఆగస్టు 15లోగా 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు జరగాలిడిసెంబర్ నాటికల్లా మరో 2.38 లక్షల ఇళ్లకు గృహ ప్రవేశాలు2027 డిసెంబర్ నాటికి మరో 10 లక్షల ఇళ్ల నిర్మాణం లక్ష్యం. 2 లక్షల మందికి ఇంటి జాగాలు అవసరం అవుతాయని అంచనా 3 సెంట్లు గ్రామాలు, 2 సెంట్లు అర్బన్ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సి ఉంది. లబ్ధిదారులు అంగీకరిస్తే... ప్రస్తుతం ఉన్న వారికి అదే లే అవుట్లల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ఇబ్బందులు లేని చోట భూసేకరణ, సమీకరణతో ఇళ్ల స్థలాలు ఇవ్వండి. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించాలి. ఇళ్ల క్రమబద్ధీకరణలో ఏమైనా ఇబ్బందులు వస్తే కెబినెట్ కు పంపాలి... మేం ఆమోదిస్తాంఇళ్ల క్రమబద్ధీకరణ పూర్తి చేయగలిగితే... విజయవాడలో 60 వేల మందికి, విశాఖలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందిగుంటూరులో 22ఏ భూముల సమస్యలను పరిష్కరించాలి. బుడగజంగాలను ఎస్సీల్లో చేర్చాలనే డిమాండ్ ఉంది... దీనిపై కేంద్రంతో మాట్లాడతాం. కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు ఉద్యోగాలు మినహా ఎస్సీలకు వర్తింప చేసే ప్రతి ప్రయోజనాన్ని బుడగజంగాలకు వర్తింప చేయాలి. రాష్ట్రంలో బీసీ కులాల వెనుకబాటుతనం అధ్యయనం చేయడానికి ఓ ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశాం. కమిషన్ ఇచ్చే నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల్లో తగిన రిజర్వేషన్లు కల్పించేందుకు చర్యలు చేపడతాం బీసీ హాస్టళ్లల్లో ఆర్వో యూనిట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం... హాస్టళ్లకు మరమ్మత్తులు చేపట్టాం. ముస్లిం జనాభా ఉన్న చోట 175 నియోజకవర్గాల్లోనూ రూరల్ ఆటోనగర్ లు ఏర్పాటు చేస్తే ఓ పారిశ్రామిక వాడ సిద్ధం అవుతుంవక్ఫ్ బోర్డు స్థలాల్లో ఈ పారిశ్రామికవాడలను మైనారిటీల కోసమే ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి... లైవ్ లీ హుడ్ హబ్ లు గా వీటిని అభివృద్ధి చేయాలి.

## మే 10న. ప్రధానమంత్రి సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావాలని పిలుపునిచ్చిన: చొప్పరి జయశ్రీ



**కరీంనగర్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

మే 10న. సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్ లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకావాలని 12డివిజన్ కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ అన్నారు.ఆమె కరీంనగర్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మే 10.న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు రావాలని, వచ్చి జయప్రదం చేయగలరని కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ వేదికపై భారతదేశ గౌరవాన్ని మరింత ముందుకు తీసుకెళుతున్నటువంటి నాయకులు మన ప్రధానమంత్రి నరేంద్ర మోడీ. ప్రజల ఆకాంక్షలకు ప్రతీకగా ముందుకు వెళుతున్నటువంటి పార్టీ భారతీయ జనతా పార్టీ అని ఆమె అన్నారు.మే 10 న.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో జరుగుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ బహిరంగ సభకు పెద్ద సంఖ్యలో ప్రజలందరూ విచ్చేసి జయప్రదం చేయగలరని చొప్పరి జయశ్రీ ప్రజలను విజ్ఞప్తి చేశారు.

## మజ్జిగ పంపిణీ



**ఉదయం న్యూస్ ఆళ్లగడ్డ**

ఆళ్లగడ్డలోని ఆర్టీసీ బస్టాండ్ లో శుక్రవారం భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రయాణీకులకు పెరుగన్నం వితరణ చేశారు. ఆర్టీసీ డిపో మేనేజర్ సుబ్రమణ్యం ఈ కౌంటర్ ను ప్రారంభించి మాట్లాడుతూ.. ప్రస్తుతం మండు వేసవిలో సత్య సాయి సేవ సమితి వారు మజ్జిగ పంపిణీ తో పాటు పెరుగన్నం వితరణ చేయడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డ్రైవర్లు రాజశేఖర్, రమణ, లక్ష్మి రెడ్డి మెకానిక్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

## మండల కేంద్రంలో వడ్డే వీధిలో తిష్ట వేసిన సమస్యలు

**కాలువలను సైతం శుభ్రపరచని అధికారులు.**

**ఆరోగ్యంతో ఆస్పత్రులు చుట్టూ తిరుగుతున్న వీధి ప్రజలు.**

**మద్దికేర:ఉదయం న్యూస్:**



మండల కేంద్రమైన మద్దికేరలోని వడ్డే వీధిలో అధికారులు సమస్యలను పరిష్కరించకపోవడంతో సమస్యలన్నీ తిష్ట వేసినట్లు మండల అధ్యక్షుడు శంకర్ బాబు,జిల్లా కార్యవర్గ సభ్యులు డాక్టర్ రామ్మోహన్,శ్రీనివాసులు లు తెలియజేశారు.ఈ సందర్భంగా శుక్రవారం రోజున వడ్డే వీధిలో పర్యటించి వీధిలో గల సమస్యలను గ్రామ ప్రజల ద్వారా అడిగి తెలుసుకున్నారు.వడ్డే వీధిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (డిపిఈపి) వద్ద కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తను వారు పరిశీలించారు. కాలువలో నిలిచిపోయిన వ్యర్థాల వలన దోమలు పెరిగే ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని వారు తెలియజేశారు.చాలామంది వీధి ప్రజలు ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని ప్రజలు తెలియజేశారు. ప్రజల ఆరోగ్యం పై నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని వీధి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారుల స్పందించి కాలువలను శుభ్రపరిచి వీధి ప్రజల సమస్యలను పరిష్కరించాలని బిజెపి నాయకులు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎక్స్ ఆర్మీ ఉద్యోగి గోపాల్,వీరుపాపురం సురేష్,బండి రాముడు,కైలాస్,ఎర్రి స్వామి,బాలకృష్ణ,వీధి ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కాసుల కోసం కక్కుర్తి: డాక్టర్ దారా

**ఉదయం ప్రతినిధి నందికొట్కూరు మే 8**



రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటినుండి నందికొట్కూరులో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కమిషన్ల దందా రాజ్యమేలుతూది కాసుల కోసం కక్కుర్తిగాని పట్టణ అభివృద్ధి శూన్యంఅని నందికొట్కూరు వైఎస్ఆర్సిపి ఇన్చార్జి డాక్టర్ దారా సుధీర్ ఆరోపణలతో ఆగ్రహం చెందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ కార్యాలయంలో కూటమి ప్రభుత్వం స్థానిక నాయకులకు కమిషన్లు ఇవ్వకపోతే మున్సిపాలిటీలోని ఆఫీసులో ఒక గదికి తాళం వేసి మరీ వసూళ్లు చేస్తున్నారు. సాయంత్రానికి కమిషన్లు పార్టీ పెద్దలకు చేరాల్సిందేనా అని ఆవేదన చెందారు. వైఎస్ఆర్సిపి పాలనలో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోని రూ. 59 కోట్లతో అభివృద్ధి చేశాం.ప్రస్తుత ఎమ్మెల్యే ఏం చేశారో చర్చకు సిద్ధమా అని అన్నారు. డంపింగ్ యార్డ్ కాలుష్యం వల్ల కుమ్మరిపేట,బైరెడ్డి నగర్,వాల్మీకి నగర్, వడ్డేపేట కాలనీ? జనం అనారోగ్యాలతో అల్లాడుతుంటే పట్టించుకోరా అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మూడు పెళ్లిళ్లు మీరు కూడా చేసుకోండి అన్నారు మంచిదే కానీ ముస్లింలు పెళ్లిళ్ల కోసం బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి నిర్మించిన షాది ఖానాను ప్రారంభించకుండా రాజకీయం చేయడం ఎంతవరకు సమంజసమన్నారు.

దళిత కాలనీలలో మరుగుదొడ్లు నిర్మించి కుళాయి కనెక్షన్ల లోకూడా గ్రూపు రాజకీయాలు చేస్తూ సామాన్య ప్రజలను పట్టించుకోవడంలేదని టిడిపి పై మండిపడ్డారు.

## పోరుమామిళ్ళ పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర హత్య

**ఉదయం ప్రతినిధి పోరుమామిళ్ల**




పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో ఘోర హత్య కేసు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన 05.05.2026 రాత్రి 10.30 గంటల సమయంలో చిన్న ఎర్రసాల గ్రామం ఉత్తర వైపున ఉన్న అప్పన్న బావి సమీపంలో, పోరుమామిళ్ల -- పెద్ద ఎర్రసాల రోడ్డుపై చోటుచేసుకుంది. ఈ విషయమై 07.05.2026 ఉదయం 11.30 గంటలకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు అందింది.కేసు వివరాల ప్రకారం, నిందితుడు షేక్ జాఫర్ వల్లి అలియాస్ బాషా (ఖా.1) మృతుడు మానేపాటి సురేష్ (37 సంవత్సరాలు), సుంకన్న కుమారుడు, ఎస్టీ-ఎరుకల కులానికి చెందినవాడు, వృత్తి కోతి పట్టేవాడు, స్వస్థలం తెలుగుపేట గ్రామం, ప్రస్తుతం నంద్యాల జిల్లా బనగానపల్లె మండలం బానుముక్కల గ్రామంలో నివసిస్తున్నాడు, అతని తలపై రాయితో బలంగా కొట్టాడు. దీంతో మృతుడు తీవ్ర రక్తస్రావ గాయాలతో నేలపై పడిపోయాడు.అనంతరం నిందితుడు ఖా.1 మరియు అతని భార్య షేక్ హసీనా (ఖా.2) కలిసి మృతుడిని చేతులు, కాళ్లతో విచక్షణారహితంగా కొట్టి, రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి చెత్తకుప్పలో పడవేసి నిప్పంటించారు. దీంతో మృతదేహం పూర్తిగా కాలిపోయి, కేవలం తల ఎముకలు మరియు కాలి ఎముకలు మాత్రమే మిగిలాయి.తరువాతి రోజు నిందితులు ఈ విషయాన్ని ఫిర్యాదుదారు మానేపాటి వెంకటేశ్వరి అలియాస్ ఎరుకల వెంకటేశ్వరి (29 సంవత్సరాలు), మృతుడి భార్య, తెలుగుపేట గ్రామం స్వస్థలం, ప్రస్తుతం బానుముక్కల గ్రామంలో నివసిస్తున్నది, ఆమెకు తెలియజేసి, ఈ విషయాన్ని ఎవరికి చెప్పినా చంపేస్తామని బెదిరించారు.

దర్యాప్తులో తెలిసిన వివరాల ప్రకారం, నిందితుడు ఖా.1 ఫిర్యాదుదారుతో అక్రమ సంబంధం ఏర్పరుచుకొని, ఆమె భర్తను చంపి ఆమెను వివాహం చేసుకుంటానని పలుమార్లు చెప్పినట్లు తెలిసింది. అయితే ఆమె నిరాకరించడంతో, 05.05.2026 న అవకాశం దొరకడంతో ఖా.1 తన భార్య ఖా.2 సహాయంతో మృతుడిని హత్య చేసినట్లు వెల్లడైంది.నిందితుల బెదిరింపుల కారణంగా ఫిర్యాదుదారు కొంతకాలం వారి వెంటనే ఉండగా, ఈరోజు నిందితులు అప్రమత్తంగా లేని సమయంలో అక్కడి నుండి తప్పించుకొని పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు

## వివాహ వేడుకలకు హాజరైన మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

**తుగ్గలి:ఉదయం న్యూస్:**



తుగ్గలి మండలం నందు పలు గ్రామాల యందు జరిగిన వైఎస్ఆర్సిపి నాయకుల యొక్క వివాహ వేడుకలకు,నూతన గృహప్రవేశ వేడుకలకు పత్తికొండ మాజీ శాసనసభ్యురాలు కంగాటి శ్రీదేవి శుక్రవారం రోజున హాజరయ్యారు. మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలో ప్రజ్ఞ స్కూల్ నందు జరిగిన తుగ్గలి మాజీ ఎంపీపీ ఎర్ర నాగప్ప కుమారుని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు.అదేవిధంగా మండల పరిధిలోని పెండేకల్లు గ్రామంలో రంగన్న కుమారుని వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరయ్యారు. అనంతరం రాంపురం గ్రామ వైయస్సార్సిపి పార్టీ నాయకులు సుంకప్ప నూతన గృహప్రవేశ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్,జడ్పిటిసి పులికొండ నాయక్,మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి,ఎర్రగుడి రామచంద్రారెడ్డి, శ్రీరంగడు,రాంపురం గంగాధర్,బద్రి తదితర వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహానాడు లో రక్తదానం మెడికల్ క్యాంపు కమిటీలో బద్వేల్ నుండి డాక్టర్ ఓబులాపురం రాజశేఖర్

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



తెలుగుదేశం పార్టీ ప్రతి సంవత్సరము మే 26-28 తేది లలో మహానాడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతుంది. ఈ సంవత్సరము నెల్లూరు జిల్లాలో జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుండి ప్రతి విభాగంలో కమిటీ లను నారా చంద్రబాబు నాయుడు , లోకేష్ స్వయంగా పరిశీలించి ఏర్పాటు చేశారు.రక్తదానం, మెడికల్ క్యాంపు కమిటీ నందు బద్వేలు నియోజకవర్గం నుండి డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్ ను కమిటీ సభ్యులు గా నిన్న విడుదల చేసిన జాబితా లో నియమించడం జరిగింది.కడప జిల్లా నుండి కేవలం ఐదు మంది ని మాత్రమే తీసుకోవడం జరిగింది అందులో బద్వేలు నియోజకవర్గం నుండి డాక్టర్ రాజశేఖర్ మహానాడు కమిటీల్లో వున్నారు. గతంలో కూడా అనంతపురం లో జరిగిన సూపర్ సిక్స్ -సూపర్ హిట్ ప్రోగ్రాం నందు, కర్నూల్ లో జరిగిన ప్రధానమంత్రి సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ ప్రోగ్రాం బహిరంగ సభకు కూడా డాక్టర్ రాజశేఖర్ పార్టీ ఆదేశానుసారం వైద్య సేవలు అందించారు.ఈ సందర్భంగా డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ పార్టీ తన సేవలను వినియోగించు కుంటున్నందులకు హర్షం వ్యక్తం చేశారు, తన అదృష్టం గా భావిస్తున్నట్లు తెలియజేసారు. మహానాడు సభ విజయవంతం కావాలని కోరుకుం టున్నట్లు తెలియజేసారు. బద్వేలు నియోజకవర్గం నుండి కార్యకర్తలు, నాయకులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చెయ్యాలని, ఎండ తీవ్రతకు తగిన జాగ్రత్త లు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

## మహిళల భద్రతే పోలీసుల మొదటి కర్తవ్యం... సీఐ పులి శేఖర్ గౌడ్

**మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.**


**తుగ్గలి:ఉదయం న్యూస్:**




మహిళల యొక్క భద్రతే పోలీసుల యొక్క మొదటి కర్తవమని పత్తికొండ రూరల్ సీఐ పులి శేఖర్ గౌడ్ అన్నారు.జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.శుక్రవారం రోజున తుగ్గలి మండల పరిధిలోని గల జొన్నగిరి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణం గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలపై,చిన్నారులపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలపై ఆయన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రస్తుత సమాజంలో మహిళలపై,చిన్నారులపై జరుగుతున్నటువంటి మోసాల గురించి, ఐవిఆర్ఎస్ కాల్స్ వారు అవగాహన కల్పించారు.స్మార్ట్ ఫోన్ కలిగిన ప్రతి ఒక్క మహిళ తమ ఫోన్ నందు శక్తి యాప్ను తప్పకుండా ఇన్స్టాల్ చేసుకోవాలని ఆయన తెలియజేశారు.ఈ శక్తి యాప్ లోని జిపిఎస్ ఆధారంగా పది నిమిషాలలోపు పోలీసులు అక్కడికి చేరుకొని మహిళలను రక్షించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. అదేవిధంగా ప్రస్తుత సమాజంలో జరుగుతున్న డిజిటల్ మోసాలపై కూడా మహిళలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలియజేశారు.అదేవిధంగా మహిళలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలియజేశారు. మహిళలపై జరుగుతున్నటువంటి అఘాయిత్యాలను 100,112 నంబర్లకు కాల్ చేసి నేరుగా ఫిర్యాదు చేయవచ్చని ఆయన తెలియజేశారు.అనంతరం జొన్నగిరి ఎస్సై మల్లికార్జున మహిళల భద్రత కొరకు ప్రతిరోజు పోలీసులు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు .మహిళలు సమాజంలో జరుగుతున్న టువంటి చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలందరూ తమ స్మార్ట్ఫోన్లు యందు శక్తి యాప్ ను ఇన్స్టాల్ చేసుకొని వాటి సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన మహిళలకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏపిఎం రాధాకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అంబిక,విద్యా కమిటీ చైర్మన్ మిద్దె రవి,మిద్దె వెంకటేశ్వర్లు,బాలన్న,బిసి సంఘం మండల అధ్యక్షుడు సంఘాల కృష్ణ, పార్థయ్య,హోటల్ మల్లి,జొన్నగిరి పోలీస్ సిబ్బంది,అంగన్వాడీ వర్కర్లు,జొన్నగిరి గ్రామ ప్రజలు,

## కరీంనగర్ ఘటనపై డీజీపీకి బీఆర్ఎస్ నేతల ఫిర్యాదు



**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు.ఈ సందర్భంగా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలపై డీజీపీకి బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేశారు. కరీంనగర్‌లో గురువారం మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంతో పాటు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వాహనంపై బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన విషయం తెలిసిందే..ఈ అంశంపై డీజీపీకి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నేతలపై దాడులను అరికట్టాలని, శాంతిభద్రతలను కాపాడాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బండి సంజయ్,ముఖ్యమంత్రి చీకటి ఒప్పందాలు, వ్యాపారాలు అందరికి తెలుసని ఎమ్మెల్యే వివేకానంద గౌడ్ వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్‌కు అహకారం పెరిగిందన్నారు. 'మీ భాషపై మీ భాషలో చెబితే దాడులు చేస్తారా. కౌశిక్ రెడ్డి ఏమి తప్పు మాట్లాడారో చెప్పాలి. వచ్చేది మా ప్రభుత్వం. అప్పుడు బండి సంజయ్ గుజరాత్ వెళ్లి దాక్కోవాలి.అన్ని ఆధారాలను డీజీపీకి ఇచ్చాం. రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతాం అని వివేకానంద గౌడ్ హెచ్చరించారు.

శాంతిభద్రతలు దిగజారిపోయాయి పల్లా రాజేశ్వర్ రెడ్డి.

తెలంగాణ రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా దిగజారిపోయాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. వెనుకబడిన రాష్ట్రాలలో ఏ విధంగా ఉన్నదో అదే తెలంగాణలో ఉందన్నారు.నచ్చని రాజకీయ పార్టీల నేతల కార్యాలయాలు, ఇళ్లపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో పోలీసుల చేతగానితనాన్ని డీజీపీకి వివరించినట్లు తెలిపారు.కౌశిక్ రెడ్డిని చంపాలని వచ్చారన్నారు. బండి సంజయ్ రెచ్చగొడితేనే కార్యకర్తలు వచ్చారని ఆయనపై కేసు నమోదు చేయాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు.

# బత్తల రమణ ను పరామర్శించిన ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



బద్వేలు మున్సిపాలిటీ 21వ వార్డు రామాంజనేయ నగర్‌కు చెందిన బత్తల రమణ తల్లి వెంకటమ్మ ఆకస్మిక మరణం చెందిన విషయం తెలుసుకున్న ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన సూర్యనారాయణ రెడ్డి , వారికి ధైర్యం చెప్పారు. వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబుళాపురంరాజశేఖర్,గాజులపల్లి శంకర్ రెడ్డి,అరవ శ్రీనివాసులరెడ్డి,సీమాంక్ హాస్పిటల్ డైరెక్టర్ జహంగీర్ భాషా,మాచుపల్లి కృష్ణారెడ్డి,బద్వేల్ పట్టణ మాజీ టీడీపీ అధ్యక్షుడు కొంకుల రాంబాబు ,గోపిరెడ్డి,కార్యకర్తలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# టీకా బాలికలకు ఒక వరం.

డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి వెంగయ్య.

**బద్వేలు ఉదయం ప్రతినిధి**



14 సంవత్సరాలు నిండిన బాలికలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ రాకుండా హెచ్ పి వి టీకా ఒక వారం లాంటిదని ,డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి బి వెంగయ్య అన్నారు. బద్వేల్ మండలం కొత్తచెరువు, రంగాపురంలో శుక్రవారం హెచ్ పి వి పై అవగాహన కార్యక్రమం, ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. వైద్య సిబ్బంది ఇంటింటి ఫీవర్, లార్వా సర్వేను నిర్వహించి, లార్వా ఉన్న నీటిని పడవేయించారు. 14 సంవత్సరాలు కలిగిన బాలికలకు హెచ్పీవీ టీకాలు వేయించాలి. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే పాటించాలి. పరిసరాలను శుభ్రంగా పెట్టుకోవాలి. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటూ, బ్యానర్లు చేతపట్టి, వైద్య సిబ్బంది పలు వీధులలో ర్యాలీని నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ అధికారి మాట్లాడుతూ, హెచ్ పి వి టీకా బాలికలకు సంజీవని లాగా పని చేస్తుందన్నారు. సరైన సమయంలో పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు ఇప్పించి, మెరుగైన ఆరోగ్యం అందించేటట్లు పిల్లల తల్లిదండ్రులు చేయాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు మాట్లాడుతూ, నిల్వ ఉన్న నీరు ,తడి ప్రదేశాలలో అప్డేట్, ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ ను చల్లిస్తున్నామన్నారు.

104, విలేజ్ హెల్త్ క్లినిక్, అవసరమైన చోట మెడికల్ క్యాంపులను నిర్వహించడం ద్వారా ,ప్రజల వద్దకే వైద్యం అందుతుందన్నారు. అన్ని జబ్బులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మందులు సమృద్ధిగా ఉన్నాయన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో పోయి వేల రూపాయలు పోగొట్టుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ వీణ, ఏఎన్ఎం దీపిక, ఆశలు, ప్రజలు పాల్గొన్నారు.

# మలేరియా నివారణకు ఇంటింట మందుల స్ప్రేయింగ్

**(అరకులోయ ఉదయం న్యూస్ )**



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలం మాడగడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల శిరగం పంచాయితీ కోడిపుంజువలస హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న గ్రామంలో ఇంటింటకి స్ప్రేయింగ్ ప్రగతి పనితీరు పరిశీలించారు మలేరియాజ్వరాల నివారణ కొరకు వైద్య ఉన్నత అధికారుల వైద్య అధికారి ఆదేశాల మేరకు మలేరియా ప్రభావిత ప్రాంతాల దోమల నివారణ కొరకు దోమల మందు స్ప్రెయింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న అన్నారు రక్తపూతల సేకరణ మలేరియా బాధితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు గ్రామ ప్రజలు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని దోమలు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ అసిస్టెంట్ చట్టు చిన్న గ్రామ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# ఉద్యోగ విరమణ ప్రతి ఉద్యోగికి విశ్రాంతి..

**ఉదయం న్యూస్ చాగలమర్రి**



సుదీర్ఘకాలంగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన ప్రతి ఒక్క ఉద్యోగికి రిటైర్మెంట్ విశ్రాంతి అని చాగలమర్రి మండలం ఐసిడిఎస్ సూపర్వైజర్ సుశీల అన్నారు. శుక్రవారం చింతలచెరువు గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ జయలలితమ్మ, ముత్యాలపాడు మూడవ సెంటర్ అంగన్వాడి సహాయకురాలు వెంకటసుబ్బమ్మ ల రిటైర్మెంట్ కార్యక్రమానికి సూపర్వైజర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగ విరమణ పొందిన వారిని సన్మానించారు. సమగ్ర శిశు అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంగన్వాడి టీచర్ గా నియమించబడి మాత శిశు సంరక్షణకు గ్రామంలో విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా పని భారం ఎక్కువ, వేతనం తక్కువ అయినప్పటికీ కుటుంబాన్ని పోషించుకుంటూ ప్రజాసేవ చేయడం జరిగిందన్నారు. ఎందరో విద్యావంతులు ఉన్నప్పటికీ కొందరికి మాత్రమే ఉద్యోగాలు రావడం అదృష్టంగా భావించాలన్నారు. ఉద్యోగం ఒక వరంగా భావించారని సూచించారు. అధికారులకు, ప్రజలకు జవాబుదారీగా ఉంటూ విధులు నిర్వహించడం ఎన్నో సవాళ్లను ఎదురుకోవడమేనని ఆమె తెలిపారు. అంగన్వాడి టీచర్ జయలలిత మాట్లాడుతూ ఉద్యోగంలో చేరినప్పుడు మ్యాన్యువల్ రూపంలో రికార్డులు నిర్వహించే వారమని ప్రస్తుతము సాంకేతిక పరిజ్ఞానం ఉన్న కాలంలో ప్రతి రికార్డులను టెక్నికల్ గా నమోదు చేయాల్సి ఉందని, వీటిలో సూపర్వైజర్,సహపాటి అంగన్వాడి టీచర్లు ద్వారా తెలుసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని అంగన్వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పక్షపాతిగా మూసీ పునరుజ్జీవనం ప్రజల భాగస్వామ్యంతోనే నదికి కొత్త కళ!

ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటి చెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ ప్రాజెక్టును అత్యంత పారదర్శకంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తి స్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది. ప్రజల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని కమిటీ నొక్కి చెప్పింది. ప్రజల ఆస్తులకు, నివాసాలకు కనీస నష్టం కూడా కలగకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వం మానవీయ కోణంలో ఆలోచిస్తోంది. ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా అలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. అత్యంత జాగ్రత్తగా ప్రణాళికలు రూపొందించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించింది.

"మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, "అభివృద్ధి ప్రజా హితం"రెండు సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశం చేసింది.



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన జరిగిన మూసీ పునర్జీవం ప్రాజెక్టు క్యాబినెట్ సబ్ కమిటి సమావేశం శుక్రవారం ప్రజాభవన్ లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్ తో కలిసి డిప్యూటి సీఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్ పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్-1 సుమారు 7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ ఏడిబి నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ -1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు.

మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్ ను మూసి ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు.

ఈస్ట్-టు-వెస్ట్ కారిడార్ లో భాగంగా నార్సింగి-గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్త్రతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్ లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ,ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు.

# పత్తికొండ అంగన్వాడీ కేంద్రాలలో నిర్లక్ష్యం వహిస్తున్న అంగన్వాడీ టీచర్లపై తగిన చర్యలు తీసుకోవాలి... బిజెపి మండల అధ్యక్షుడు కరణం నరేష్

**పత్తికొండ:ఉదయం న్యూస్:**

నియోజకవర్గ కేంద్రమైన పత్తికొండ అంగన్వాడీ కేంద్రాలలో విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యం వహిస్తున్న అంగన్వాడీ టీచర్లపై తగిన చర్యలు తీసుకోవాలని బిజెపి మండల అధ్యక్షుడు కరణం నరేష్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో పత్తికొండ మండలంలోని కొన్ని అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న అవకతవకలు,నిర్లక్ష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ కర్నూలు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తికొండ మండలంలోని కొన్ని అంగన్వాడీ కేంద్రాలు దాదాపు గత 5 నెలల నుంచి నిర్దిష్ట సమయాలకు తెరవడం లేదని,కేంద్రాల్లో టీచర్లు లేకుండా ఆయాలకే బాధ్యతలు అప్పగించి వెళ్లిపోతున్నారని ఆరోపించారు. గర్భిణీలకు,బాలింతలకు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న బాల సంజీవని కిట్టు,బాలామృతం, అన్ని రకాల పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ కావడం లేదని,రికార్డుల్లో కూడా తారుమారులు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అలాగే కొంతమంది అంగన్వాడీ సిబ్బంది విధులను పక్కనపెట్టి,సెలవులు పెట్టకుండా రాజకీయ కార్యక్రమాలలో పాల్గొంటున్నారని, సూపర్వైజర్లు



మరియు సంబంధిత అధికారులు సరైన పర్యవేక్షణ చేయడం లేదని అందుకే కిందిస్థాయి సిబ్బంది నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఇప్పటికే ఎమ్మార్వోకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినప్పటికి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. అంగన్వాడీ కేంద్రాలపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించి,బాధ్యులపై శాఖపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తుంది అని అన్నారు. విధులకు హాజరుకాని సిబ్బంది,రాజకీయాల్లో పాల్గొంటున్న

టీచర్లు మరియు ఆయాలపై విచారణ చేపట్టాలని,సిడిపిఓ ప్రతిరోజు ఆఫీసుకు మరియు సూపర్వైజర్ల బాధ్యతారాహిత్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో సమయపాలన కచ్చితంగా అమలు చేసి, బాల సంజీవని కిట్టు,బాలామృతం,అన్ని రకాల పౌష్టికాహార పంపిణీ పారదర్శకంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోదిపల్లి మాలతి తదితరులు పాల్గొన్నారు

# స్వీయ గణన నమోదులో భాగస్వామ్యులు కావాలి ఈ నెల 10 వ తేదీతో ముగియనున్న స్వీయ గణన గడువు

జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్

**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఉదయం న్యూస్**

జన గణన 2027 లో భాగంగా స్వీయ గణన నమోదులో భాగస్వామ్యులు కావాలని, ఈ నెల 10 వ తేదీతో స్వీయ గణన నమోదు గడువు ముగియనుందని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం ప్రకటన జారీ చేశారు.

స్వీయ గణన కోసం https://se.census.gov.in వెబ్ సైట్ ద్వారా లాగిన్ కావాలని సూచించారు. ఈ మొత్తం ప్రక్రియకు కేవలం 5 నిమిషాల సమయం పడుతుందని, వెబ్ సైట్ పూర్తి స్థాయిలో సురక్షితమని



స్పష్టం చేశారు. ప్రజల సమాచారం పూర్తిభద్రంగా ఉంటుందని వెల్లడించారు. 34 ప్రశ్నలకు సరైన సమాచారం నమోదు చేసి ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, జిల్లాలోని ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ- ప్రైవేట్ ఉద్యోగులు వారి మొబైల్ ఫోన్ల ద్వారా స్వీయ గణన చేసుకుని ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రిన్సిపల్ సెన్సస్ ఆఫీసర్ గరిమ అగ్రవాల్ కోరారు.

జనగణనకు సంబంధించి ఏమైనా సందేహాలు ఉంటే హెల్ప్ లైన్ నెంబర్ 1855 కు సంప్రదించాలని, ఈ నంబర్ 24ఇ 7 అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

# తెలంగాణలో బీసీ కులాల పేర్లు మార్పు: కొత్త పేర్లు ఇవే!

**హైదరాబాద్ ప్రతినిధి, ఉదయం న్యూస్**

తెలంగాణలోని వెనుకబడిన తరగతుల బీసీ చిరకాల వాంఛను నెరవేరుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలకమైన సామాజిక సంస్కరణకు శ్రీకారం చుట్టింది.

సమాజంలో కించపరిచే విధంగా ఉన్న కొన్ని కులాల పేర్లను తొలగించి,వాటి స్థానంలో గౌరవప్రదమైన పేర్లను చేరుస్తూ రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. బీసీ కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా తీసుకున్న ఈ నిర్ణయం వల్ల ఆయా వర్గాల ఆత్మగౌరవం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మార్పులు తక్షణమే రాష్ట్ర గెజిట్ ద్వారా అధికారిక రికార్డుల్లోకి రానున్నాయి. బీసీ గ్రూప్-ఏలో విప్లవాత్మక మార్పులు..ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పుల్లో బీసీ గ్రూప్-ఏ విభాగంలో అత్యధిక మార్పులు జరిగాయి. ముఖ్యంగా వినడానికి అసభ్యకరంగా ఉన్న పదాలను రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.

దొమ్మర:ఈ పేరును తొలగించి గడ వంశీయ'గా మార్చారు. పిచ్చకుంట్ల: ఇకపై ఈ కులస్తులను వంశ రాజ్ గా వ్యవహరిస్తారు. బుడబుక్కల: వీరికి 'శివ క్షత్రియ' అనే గౌరవప్రదమైన పదాన్ని జోడించారు.

వీరభద్రియ: వీరి కోరిక మేరకు 'వీరముష్టి, నెట్టి కోటల' అనే పదాలను పర్యాయపదాలుగా చేర్చారు.

వన్నార్:ఈ పదాన్ని తొలగించి, రజక-చాకలి వర్గాల కోసం 'ధోబీ'అనే పదాన్ని ఖరారు చేశారు. గ్రూప్-డిలో 'శూద్ర' పదం తొలగింపు..బీసీ గ్రూప్-డి విభాగంలో కూడా ప్రభుత్వం సామాజిక స్పృహతో పలు మార్పులు చేసింది. ఎప్పటి నుంచో వివాదాస్పదంగా ఉన్న 'శూద్ర కులం' అనే పదాన్ని అధికారిక రికార్డుల నుంచి పూర్తిగా తొలగించారు.

ఆ స్థానంలో 'తమ్మలి బ్రాహ్మణేతర'గా పేరు మారుస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీనివల్ల ఆ వర్గానికి స్పష్టమైన సామాజిక గుర్తింపు లభిస్తుంది. అలాగే వరుస సంఖ్య 5లో ఉన్న మేర, చిప్పోలు, కులాలకు అదనంగా 'మేరు' అనే పదాన్ని చేర్చారు.

విద్యార్థులు,ఉద్యోగార్థులకు మేలు:

ఈ నిర్ణయం వల్ల భవిష్యత్తులో విద్యార్థులు, ఉద్యోగార్థులు తమ కుల ధ్రువీకరణ పత్రాల్లో గౌరవప్రదమైన పేర్లను పొందే అవకాశం కలుగుతుంది. సమాజంలో పిలిచేటప్పుడు కలిగే ఇబ్బందులను తొలగించి, ఆయా వర్గాల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపడమే ఈ సంస్కరణ ముఖ్య ఉద్దేశమని బీసీ కమిషన్ వెల్లడించింది. కులాల పేర్ల మార్పుపై హర్షం వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాలు,ఇది తమ సామాజిక హోదాను పెంచుతుందని అభిప్రాయ పడుతున్నాయి.

# ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లు

- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం
- గృహ విప్లవం, రెవెన్యూ సంస్కరణలతో నవశకానికి శ్రీకారం
- అదనపు ఎమ్మార్వోల నియామకం
- ఏ చిన్న పొరపాటు జరిగిన ఉపేక్షించేది లేదు
- ఉమ్మడి నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల సమీక్ష
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




**హైదరాబాద్, మే 7:** ప్రతి పేదవాడికి సొంత ఇల్లును సమకూర్చడం, భూ యాజమానులకు తమ భూమి పై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం పేదల జీవితాల్లో శాశ్వత మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు. ఇల్లు, భూమి ప్రతి కుటుంబానికి ఆత్మగౌరవానికి ప్రతీకని పేదవాడికి భద్రమైన భవిష్యత్తు కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పేర్కొన్నారు. పేదల జీవితాల్లో గౌరవప్రదమైన మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు అనే మహత్తర కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. పథకం కింద పేద కుటుంబాలకు వారి సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణం కోసం ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. దాదాపు 4 లక్షల ఇళ్లను మంజూరు చేసి, రాష్ట్రవ్యాప్తంగా గృహ విప్లవానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. హౌసింగ్, రెవెన్యూ అంశాలపై జిల్లాల వారీగా ప్రజా ప్రతినిధులతో జరుపుతున్న సమీక్షలో భాగంగా గురువారం హౌసింగ్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన ఇన్ ఛార్జి మంత్రులు, మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, హౌసింగ్, రెవెన్యూ, ఫారెస్టు అధికారాలతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాల్లో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, నల్గొండ ఇన్ ఛార్జి మంత్రి ఎస్సీ ,ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్, వాకాటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక బోర్డు వైస్ చైర్మన్ జి. చిన్నా రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు జితేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో క్షేత్ర స్థాయిలోని పరిస్థితులపై స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయంతో వ్యవహరించాలని, జిల్లా స్థాయి-ంలో అధికారయంత్రాగమంతా సమన్వయంతో పనిచేస్తే అక్కడికక్కడే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా కలెక్టర్లు పనిచేయాలని ఆదేశించారు. పథకం అమలులో అత్యధిక శాతం అధికారాలను కలెక్టర్లకే దఖలు పరిచామ న్నారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఒకసారి ప్రొసీడింగ్స్ ఇచ్చి, మొదటి బిల్లు వారి ఖాతాల్లో జమ అయిన లబ్దిదారులందరికీ తదుపరి విడతల బిల్లులన్నిటిని సకాలంలోనే విడుదలయ్యేలా చూడాలని మంత్రిగారు కలెక్టర్లను ఆదేశించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్ల విష యంలో ఎటువంటి అక్రమాలకు తావివ్వకుండా, పూర్తి పారదర్శకంగా జవాబుదారీ తనంతో పనిచేస్తూ అర్హులైన వారికే ఫలాలు దక్కేలా చూడాలని ఈ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగినా ఉపేక్షించేది లేదన్నారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం సేకరించి పూర్తి స్థాయిలో వినియోగించకుండా మిగిలి ఉన్న భూముల్లో అర్హులైన వారికి ఇండ్ల పట్టాలు ఇచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్లకు ఆదేశాలిచ్చారు. గతంలో ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు మంజూరైనా వివిధ కారాణలతో నిర్మాణాలను పూర్తి చేయని వారికి కూడా వెసులుబాటు కల్పించే యోచనలో ఉన్నామని తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరక్టర్లు పూర్తి బాధ్యతాయుతంగా విధులను నిర్వహించాలని, లబ్దిదారులు, ఉన్నతాధికారుల మధ్య సమన్వయకర్తలుగా వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని , ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అలాగే డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణపు పనులు ఏ స్థాయిలో ఉన్నా, ఈ నెల 20 వ తేదీలోగా లబ్దిదారుల ఎంపికను పూర్తి చేయాలని, ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చొరవ చూపాలని మంత్రి పొంగులేటి సూచించారు. అర్హులైన పేదలనే లబ్దిదారులుగా ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ కార్యాలయాలన్నింటిని ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశాల్లో నెలకొల్పేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచిం చారు. అలాగే లక్షకు పైగా జనాభా ఉన్న మండలాల్లో, అవసరానికి అనుగుణంగా, అదనంగా మరో తహశీల్దార్‌ను నియమించనున్నా మని మంత్రి తెలిపారు. ఇందుకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు ప్రతిపాదనలను సిద్ధం చేయాలన్నారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖల మధ్య ఉన్నభూ వివాదాల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఆయా విభాగాలు ఉమ్మడిగా సర్వే చేయడమే మార్గమన్నారు. ఈ దిశలో మరింత వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అటవీ, రెవెన్యూ అధికారులకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఎన్నడూ లేనట్లుగా రెవెన్యూ విభాగంలో అనేక సంస్కరణలు తీసుకుని వచ్చి ఆర్డీవోలకు విస్తృతమైన అధికారాలు కల్పించామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాకుండా, ఇతర ప్రయోజనాలకు వీటిని వినియోగిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ పరిపాలనను బలోపేతం చేయడంలో భాగంగా సర్వే, సెటిల్మెంట్స్ మరియు భూ రికార్డుల శాఖ ద్వారా సమగ్ర సంస్కరణలు అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. భూ రికార్డుల్లో పారదర్శకత, ఖచ్చితత్వం తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో ముఖ్యమం త్రి నాయకత్వంలో ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పేదలకు న్యాయం జరిగేలా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని అన్నారు.

## విజయ్‌ను అడ్డుకుంటున్న కేంద్రం

- ఒక్క సీటున్న బిజెపి రాజకీయం తగదు
- గవర్నర్ తీరుతో ప్రజాస్వామ్యం అపహాస్యం
- కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ ఆగ్రహం



**చెన్నై, మే 7 :** తమిళనాడులో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్న 'తమిళగ వెట్రి కజగం' అధినేత విజయ్‌కు కాంగ్రెస్ ఎంపీ మాణికం ఠాగూర్ పూర్తి మద్దతు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు మార్పు కోసం ఎంతో ఆశగా ఓటు వేసినప్పటికీ, నటుడిగా రాజకీయాల్లోకి వచ్చిన విజయ్‌ను అడ్డుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయ న ఆరోపించారు. తమిళనాడులో వచ్చిన తీర్పు విజయ్ నాయకత్వానికి ప్రజల మద్దతును స్పష్టంగా ప్రతిబిం బిస్తోందని ఠాగూర్ పేర్కొన్నారు. గవర్నర్ వెంటనే విజయ్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి ఆహ్వానించాలని, సభలో తన మెజారిటీని నిరూపించు కోవడానికి అనుమతించాలని ఆయన డిమాండ్ చేశారు. 'తమిళనాడులో ప్రజలు మార్పు కోసం ఓటు వేశారని మనందరికీ తెలుసు.. ప్రజలు ఒక కొత్త నాయకుడి కోసం ఓటు వేశారు. ఆ పార్టీ నుంచి 108 మంది సభ్యులు ఎన్నికయ్యారు'. అని ఠాగూర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన ఐదుగురు ఎమ్మెల్యేల మద్దతుతో బలం 113కు చేరిందని, 234 మంది సభ్యులున్న అసెంబ్లీలో మెజారిటీ మార్కుకు కేవలం కొన్ని సీట్ల దూరంలోనే ఉందని ఆయన గుర్తుచేశారు.'గవర్నర్ బీజేపీకి చెందిన వ్యక్తి.. ఆయన గతంలో బీజేపీలో పనిచేశారు. ఆయనకు బీజేపీ మనస్తత్వం ఉందని మనందరికీ తెలుసు. విజయ్‌ను ముఖ్యమంత్రిని చేయకూడదన్నదే 'ఢిల్లీ' ఆలోచన'. అని ఆయన ఆరోపించారు. గవర్నర్‌పై బీజేపీ నాయకత్వం నుంచి ఒత్తిడి ఉందని ఠాగూర్ అన్నారు. రాష్ట్ర అసెంబ్లీలో కేవలం ఒక్క ఎమ్మెల్యే మాత్రమే ఉన్నప్పటికీ, బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియను ఆలస్యం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. రాజ్యాంగ సంప్రదాయాలు, ప్రజాస్వామ్య నిబంధనలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా విజయ్‌ను సభలో బలాన్ని నిరూపించుకునే అవకాశం కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ సూచించారు. 'విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి త్వరగా ఆహ్వానించాలని, సభలో బలాన్ని నిరూపించుకోవడానికి అనుమతించాలని భావిస్తున్నా.. అదే న్యాయం.' అని ఠాగూర్ అన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

### ఏకసభ్య కమిషన్ నివేదికపై కమిటీ

**అమరావతి, మే 7:** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ జీవో నంబర్ 900ను జారీ చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికలో బయటపడిన అంశాలు, సిఫార్సులను వివరంగా అధ్యయనం చేయాలని ఆదేశించింది. పాలనాపరంగా అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సిన అంశాలపై సూచనలు చేయాలని కమిటీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏకసభ్య కమిషన్ నివేదికలోని నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేయాల్సిన అంశాలను సూచించాలని ప్రభుత్వం తెలిపింది. ఈ సిఫార్సులను అమలు చేసేందుకు తగిన పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కమిటీ సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిటీ తన నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని జీవోలో స్పష్టంగా సూచించింది.

## బెంగాల్ అసెంబ్లీ రద్దు

- గవర్నర్ ఆర్ఎన్ రవి ఉత్తర్వులు
- రాజీనామాకు మమత ససేమిరా అనడంతో నిర్ణయం

**కోల్‌కతా, మే 7:** పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని ఆ రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి గురువారం రద్దు చేశారు. ముఖ్యమంత్రి పదవికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో.. గవర్నర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. బెంగాల్‌లో శనివారం కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. శుక్రవారం బీజేపీ శాసనసభాపక్షం సమావేశం కానుంది. ఈ సమావేశంలో శాసనసభాపక్ష నేతను ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. అసెంబ్లీ రద్దుతో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని గవర్నర్ రవి బర్తరఫ్ చేసినట్లు అయింది. రాజీనామా చేసేది లేదని ఇటీవల మమతా బెనర్జీ ప్రకటించారు. దీంతో ఈ చర్య అనివార్యమయ్యింది. లేకుంటే రాజ్యాంగ పరంగా చిక్కులు వచ్చేవి. 294 స్థానాలు ఉన్న పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి రెండు విడతలుగా ఎన్నికలు జరిగాయి. మే 4వ తేదీన ఈ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో అధికారాన్ని బీజేపీకి కట్టబెట్టారు. దీంతో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. దీంతో ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బీజేపీ అగ్రనేతలు ముహూర్తం ఖరారు చేశారు. మే 9వ తేదీ ఉదయం10 గంటలకు ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని పశ్చిమ బెంగాల్ బీజేపీ చీఫ్ సమిక్ భట్టాచార్య ప్రకటించారు. ముఖ్యమంత్రి అభ్యర్థిపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీపై ఘన విజయం సాధించిన సువేందు అధికారిని ముఖ్యమంత్రిగా నియమిస్తారనే ప్రచారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతోంది. ఇంకోవైపు ఈ ఎన్నికల్లో ఓటమి పాలవడంతో ఎన్నికల సంఘంపై మమతా బెనర్జీ తీవ్ర ఆరోపణలు చేశారు. అసలు విలన్ ఈసీ అంటూ మండిపడ్డారు. ముఖ్యమంత్రి పదవికి తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదంటూ ఆమె భీష్మించుకున్నారు. బెంగాల్ అసెంబ్లీ కాలపరిమితి గురువారంతో ముగిసింది. అయినా సీఎం పదవికి మమతా బెనర్జీ రాజీనామా చేయకపోవడంతో గత ప్రభుత్వాన్ని రద్దు చేస్తున్నట్లు గవర్నర్ ఆర్.ఎన్.రవి ప్రకటించారు.

## రేవంత్‌తో బండి సంజయ్ మిలాఖత్

### కోట్ల ఆస్తులు ఎక్కడివంటూ కౌశిక్ రెడ్డి ప్రశ్న

**కరీంనగర్, మే 7 :** కేంద్ర మంత్రి బండి సంజయ్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బండి సంజయ్, సీఎం రేవంత్ రెడ్డి మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ జరిగిందని ఆరోపించారు. రేవంత్ ఏది మాట్లాడితే.. బండి సంజయ్ అదే మాట్లాడుతున్నారని తెలిపారు. బండి సంజయ్ తిట్టాల్సింది కేటీఆర్‌నా .. రేవంత్ రెడ్డినా అని ప్రశ్నించారు. బంగారం షాపులో దొంగతనం జరిగితే ప్రభుత్వానికి బాధ్యత లేదా అని నిలదీశారు. రేవంత్‌ను సంజయ్ ఒక్క మాట కూడా ఎందుకు అనడం లేదని అన్నారు. భార్య పుస్తెలు అమ్మి పోటీ చేసిన బండి సంజయ్‌కు కోట్ల రూపాయలు ఎక్కడివని ఎమ్మెల్యే ప్రశ్నించారు. బండి సంజయ్‌కు రేవంత్ రెడ్డి డబ్బులు పంపిస్తున్నారని ఆరోపించారు. కేటీఆర్‌ను విమర్శించే స్థాయి కేంద్ర మంత్రికి లేదన్నారు. బండి సంజయ్‌కు దమ్ముంటే కేటీఆర్‌తో చర్చకు రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్‌ను ఇష్టం వచ్చినట్టు తిడితే ఊరుకునేది లేదన్నారు. బండి సంజయ్‌ను కూడా తాము తిట్టగలమని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి వ్యాఖ్యానించారు.

# మద్దతు లేఖలే అసలు సమస్య

- మెజార్టీ కోసం ప్రయత్నించని విజయ్
- గతంలోనూ అనేక రాష్ట్రాల్లో ఇదే సమస్య
- గవర్నర్ల విచక్షణ మేరకు నిర్ణయాలు

**చెన్నై, మే 7:** తమిళనాట రాజకీయ అనిశ్చితి నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో విజయ్ నేతృత్వంలోని టీవీకే అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ.. స్పష్టమైన మెజార్టీ లేక తిప్పలు పడుతోంది. దీంతో ప్రభుత్వ ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతూనే ఉంది. అయితే, గతంలోనూ పలు రాష్ట్రాల్లో హంగ్ వచ్చినప్పుడు. గవర్నర్ ఆదేశాలతో మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పడిన సందర్భాలున్నాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ముఖ్యమంత్రిని నియమించే అధికారం గవర్నర్‌కు ఉంటుంది. ఒకవేళ హంగ్ ఏర్పడితే.. గవర్నర్ తన విచక్షణ మేరకు వ్యవహరించి సరైన అభ్యర్థిని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానిస్తారు. అలా గత దశాబ్దంన్నర కాలంలో ఐదు రాష్ట్రాల్లో ఇలాంటి మైనార్టీ ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఇటీవలి కాలంలో ప్రభుత్వ ఏర్పాటులో అత్యంత నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నదంటే మహారాష్ట్రలోనే..! 2019లో దాదాపు 34 రోజుల పాటు అక్కడ హైడ్రామా నడిచింది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ప్రభుత్వ ఏర్పాటుపై వచ్చిన విభేదాల కారణంగా దశాబ్దాల నాటి భాజపా-శివసేన కూటమి విచ్ఛిన్నమైంది. అనంతరం అప్పటి అవిభజిత నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ నేత అజిత్ పవార్.. తన చిన్నాన్న శరద్ పవార్‌తో విభేదించి భాజపాతో చేతులు కలిపారు. అజిత్ వర్గం మద్దతు తీసుకుని ప్రభుత్వ ఏర్పాటుకు భాజపా నేత దేవేంద్ర ఫడణవీస్ ముందుకొచ్చారు. గవర్నర్ ఇందుకు సమ్మతించడంతో ఆ ఏడాది నవంబరు 23న ఫడణవీస్ సీఎంగా.. అజిత్ డిప్యూటీగా ప్రమాణం చేశారు. కానీ, ఈ ప్రభుత్వం మూడు రోజులకే కుప్పకూలింది. వ్యక్తిగత కారణాలతో భాజపాకు గుడ్‌బై చెప్పిన అజిత్ పవార్.. తిరిగి శరద్ పవార్ వద్దకు చేరుకున్నారు. అనంతరం అనూహ్యంగా కాంగ్రెస్, నాటి అవిభజిత శివసేన, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కలిసి 'మహా వికాస్ అఘాడీ'గా ఏర్పడ్డాయి. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలో ఈ సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడింది. 288 శాసనసభ స్థానాలున్న ఆ ఎన్నికల్లో భాజపాకు 105, శివసేనకు 56, ఎన్సీపీకి 54, కాంగ్రెస్‌కు 44 సీట్లు వచ్చాయి. 2018లో దక్షిణాది రాష్ట్రం కర్ణాటకలోనూ ఇదే తరహా పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలో మొత్తం 222 శాసనసభ స్థానాలుండగా.. ఆ ఎన్నికల్లో భాజపా 104 సీట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించింది. కాంగ్రెస్‌కు 80, జేడీఎస్‌కు 37 సీట్లు దక్కాయి. అయితే, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 113 సీట్ల మెజార్టీ మార్క్ ఎవరికీ రాలేదు. దీంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటూ నాటి గవర్నర్ వాజూభాయ్ వాలా.. భాజపా నేత యడియూరప్పను ఆహ్వానించారు. ఫలితంగా ఆయన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆ తర్వాత ఈ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరడంతో బలపరీక్ష అనివార్యమైంది. భాజపాకు సంఖ్యాబలం లేకపోవడంతో విశ్వాసపరీక్షకు వెళ్లకుండానే మూడు రోజులకే యడియూరప్ప ప్రభుత్వం కూలిపోయింది. అనంతరం కాంగ్రెస్, జేడీఎస్ కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేశాయి. గోవాలో 40 శాసనసభ స్థానాలుండగా.. 2017లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. కాంగ్రెస్ 17, భాజపా 13 సీట్లు గెలుచుకున్నాయి. అతిపెద్ద పార్టీగా అవతరించిన కాంగ్రెస్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానిస్తారని అంతా భావించారు. అయితే, అనూహ్యంగా నాటి గవర్నర్ మృదులా సిన్హా.. భాజపా నేత మనోహర్ పారికర్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు. అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిర్వహించగా.. చిన్న పార్టీల మద్దతుతో నాడు భాజపా సర్కారు గట్టెక్కింది. అదే ఏడాది (2017) మణిపుర్‌లో ఇదే తరహా పరిస్థితులు చోటుచేసుకున్నాయి. నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ 28, భాజపా 22 సీట్లు గెలుచుకున్నాయి. ఆ సమయంలో చకచకా పావులు కదిపిన భాజపా.. చిన్న పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడింది. మెజార్టీ చూపించడంతో నాటి గవర్నర్ నజ్మా హెప్తుల్లా ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతించారు. దీంతో బీరేన్ సింగ్ సీఎంగా ప్రమాణస్వీకారం చేశారు. మణిపుర్‌లో మొత్తం 60 శాసనసభ స్థానాలున్నాయి. దేశ రాజధాని దిల్లీలో 70 శాసనసభ స్థానాలుండగా.. 2013లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ దక్కలేదు. 31 సీట్లతో భాజపా అతిపెద్ద పార్టీగా అవతరించింది.

## దాడులు చేయాల్సిన అవసరం మాకు లేదు: బండి సంజయ్



**కరీంనగర్:** కరీంనగర్‌లో భారత రాష్ట్ర సమితి కార్యాలయంపై జరిగిన దాడి ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. భౌతికదాడులు చేయడం భాజపా సంప్రదాయం కాదని తెలిపారు. ఆ సంప్రదాయాన్ని ప్రారంభించింది గత కేసీఆర్ ప్రభుత్వమే అని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. కార్యకర్తల సహనానికి హద్దు ఉంటుందని చెప్పారు. ఘటన జరిగినప్పుడు సిరిసిల్లలోని ఓ కార్యక్రమంలో తాను ఉన్నట్లు పేర్కొన్నారు. గతంలో భాజపా, ఏబీవీపీ నేతలపై బీఆర్ఎస్ నేతలు దాడులు చేశారని ఆరోపించారు. ప్రతీకార దాడులు చేయాల్సిన అవసరం తమకు లేదన్నారు.

## గవర్నర్ తీరుపై కాంగ్రెస్ ఆగ్రహం

- నేడు లోక్‌భవన్ ముట్టడికి నిర్ణయం
- రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపు

**చెన్నై, మే 7:** తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు అంశం ఇప్పుడు రాజ్యాంగ సంక్షోభానికి దారితీస్తోంది. అత్యధిక స్థానాలు సాధించిన టివికె అధినేత విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించడంలో గవర్నర్ ఆలస్యం చేస్తుండటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ పోరుబాట పట్టబోతోంది. గవర్నర్ వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నేడురాష్ట్రవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చింది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ గవర్నర్ నిర్ణయాన్ని నిరసిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. నేడు చెన్నైలోని గవర్నర్ అధికారిక నివాసం లోక్ భవన్‌ను ముట్టడించాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చింది. కేవలం చెన్నైలోనే కాకుండా, రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాలలో భారీ ఎత్తున ధర్నాలు నిర్వహించాలని నిర్ణయించింది. ప్రజలు ఇచ్చిన తీర్పును గవర్నర్ కాలరాస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కాంగ్రెస్ ఈ నిరసనలకు శ్రీకారం చుట్టింది. గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీరు కేవలం కాలయాపన చేయడమే నని కాంగ్రెస్ నేతలు మండిపడుతున్నారు. 108 సీట్లతో అతిపెద్ద పార్టీగా ఉన్న టివికెకి, కాంగ్రెస్ (5 సీట్లు) వామపక్షాల మద్దతు కలిపితే మెజారిటీకి చేరువలో ఉన్నామని, ఈ తరుణంలో ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించకపోవడం వెనుక రాజకీయ కుట్ర ఉందని ఆరోపిస్తున్నారు. 'ప్రజలు మార్పును కోరుకున్నారు, కానీ గవర్నర్ మాత్రం ఢిల్లీ ఆదేశాల కోసం ఎదురుచూస్తున్నారు' అని కాంగ్రెస్ నేతలు విమర్శించారు. కాంగ్రెస్ పిలుపుతో తమిళనాడులో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇప్పటికే టివికె కార్యకర్తలు ఆందోళనలో ఉండగా, ఇప్పుడు కాంగ్రెస్ కూడా తోడవడంతో రాష్ట్రంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. సీపీఎం, సీపీఐ పార్టీలు కూడా ఈ ఆందోళనలకు మద్దతు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. అతిపెద్ద పార్టీగా ఉన్న టీవీకే అధినేత విజయ్‌ను వెంటనే ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించాలని కాంగ్రెస్, వామపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. గవర్నర్ వ్యవస్థను ఉపయోగించుకుని బీజేపీ రాష్ట్రంలో అస్థిరత సృష్టించాలని చూస్తోందని.. అందుకోసమే, నేటి ఉదయం నుంచే తమిళనాడులోని అన్ని ప్రధాన పట్టణాల్లో కాంగ్రెస్ శ్రేణులు రోడ్ల మీదకు రానున్నాయని కాంగ్రెస్ ప్రకటించింది.

## కరీంనగర్ జ్యువెలరీ షాపు దోపిడీ

### దొంగలు వాడిన బైక్ నంబర్ డూప్లికేట్

**కరీంనగర్,మే 7 :** కరీంనగర్ పీఎంజే జ్యూవెలరీ షాపు దోపిడీ కేసులో ట్విస్ట్ బయటపడింది. దోపిడీ కోసం దుండగులు ఉపయోగించిన బైక్‌కు.. హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి వాహనం నంబర్ వాడినట్లు విచారణలో బయటపడింది. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ షాపు వ్యాపారి ద్విచక్ర వాహనం నంబర్‌ను దుండగులు వాడినట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే సదరు వ్యాపారిని హైదరాబాద్, కరీంనగర్ పోలీసులు విచారించారు. విచారణలో మొబైల్ వ్యాపారి అపాచీ బైక్ నంబర్‌ను దుండుగులు ఉపయోగించిన బైక్‌కు పెట్టుకుని పోలీసుల దృష్టి మళ్లించే ప్రయత్నం చేసినట్లు బయటపడింది. దీంతో ఆ నంబర్ దోపిడీ దొంగలకు ఎలా తెలిసిందనే దానిపై పోలీసులు ఆరా తీశారు. హైదరాబాద్‌కు చెందిన మొబైల్ వ్యాపారి ఇటీవల తన అపాచీ బైక్ అమ్మడానికి క్షఓచీలో పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. దుండగులు క్షఓచీలో బైక్ నంబర్‌ను గుర్తు పెట్టుకుని ఆ నంబర్‌ను ఉపయోగించినట్లు పోలీసుల విచారణలో తేలింది.

## రెగ్యులర్‌గానే సిఎం కాన్వాయ్

### ట్రాఫిక్ ఆపకుండా నేరుగా ప్రయాణం

**హైదరాబాద్, మే 7:** తన కాన్వాయ్ కోసం సాధారణ ప్రజలకు ఆటంకం కలిగించొద్దంటూ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి డీజీపీని బుధవారం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణం చేసింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసానికి రెగ్యులర్ ట్రాఫిక్‌లోనే సీఎం వెళ్లడం విశేషం. తన కాన్వాయ్ రాకపోకల కోసం నగరవ్యాప్తంగా ప్రజల వాహనాలను నిలిపివేయొద్దంటూ నిన్న సీనియర్ పోలీసు అధికారులకు సీఎం ఆదేశించారు. రోడ్లపై ప్రజలకు అసౌకర్యం కలిగించే చర్యల్ని పూర్తిగా నివారించాలని సూచించారు. ఈ నేపథ్యంలో సీఎం కాన్వాయ్ కదలికల సమయంలో ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయడానికి బదులుగా ట్రాఫిక్ పోలీసులు వాహనాలను ఒకే లేన్‌లో కదలడానికి అనుమతించారు.

## ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన షెడ్యూల్ ఖరారు

**హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 10న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. ఆ రోజు మధ్యాహ్నం 2.50 గంటలకు ప్రధాని మోదీ బెంగళూరు నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. అనంతరం హెచ్ఐసీసీకి బయల్దేరి.. అక్కడే ఆయా ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. అనంతరం హైటెక్ సిటీలో ఓ ఆస్పత్రికి ప్రారంభించనున్నారు. సాయంత్రం 6.30 నుంచి 7.30 వరకు పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న బహిరంగ సభలో పాల్గొని, ప్రసంగించనున్నారు. అనంతరం బేగంపేట నుంచి గుజరాత్‌లోని జామ్‌నగర్‌కు పయనమవుతారు.

## గత అనుభవాలను గవర్నర్ గుర్తించాలి

### తమిళ నటుడు విశాల్ వ్యాఖ్యలు

**చెన్నై, మే 7 :** ప్రస్తుతం తమిళనాడులో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై నటుడు విశాల్ స్పందిస్తూ సోషల్ మీడియా వేదికగా చేసిన వ్యాఖ్యలు హాట్ టాపిక్ అయ్యాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని, ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు గవర్నర్ ఎందుకు అవకాశం ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు. 2017-18లో గోవా, మణిపూర్, మేఘాలయ, కర్ణాటకలో జరిగిన పరిణామాలను విశాల్ గుర్తు చేశారు. అప్పట్లో ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇచ్చి, తర్వాత అసెంబ్లీలో ఎ÷-లోర్ టెస్ట్ నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అదే విధంగా ఇప్పుడు తమిళనాడులో కూడా టీవీకే అధినేత విజయ్‌కు ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వాలని విశాల్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం తమిళనాడులో 233 మంది ఎమ్మెల్యేలు ప్రమాణ-స్వీకారం చేయాల్సి ఉందని, ఇలాంటి సమయంలో గవర్నర్ పాలన కాదని, ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వమే కావాలని విశాల్ ట్వీట్‌లో పేర్కొన్నారు. టీవీకే పార్టీకి దాదాపు మెజారిటీ వచ్చినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వడంలో గవర్నర్ ఎందుకు వెనుకడుగు వేస్తున్నారని విశాల్ ప్రశ్నించారు.

# స్వల్ప నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు

దేశీయ మార్కెట్లు గురువారం స్వల్ప నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ముడి చమురు ధరలు పెరగడం, విదేశీ సంస్థాగత మదుపర్లు అమ్మకాలు కొనసాగించడం వంటి కారణాలతో సూచీలు ఊగిసలాటకు గురయ్యాయి. అంతర్జాతీయ పరిణామాలతో అప్రమత్తత పాటించిన మదుపర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమూ ఓ కారణమైంది. నేటి ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 78,339 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,958 పాయింట్లు) ప్రారంభమైంది. ఒక దశలో 78,384 గరిష్ఠానికి.. 77,713 కనిష్ఠానికి చేరింది. చివరకు 114 పాయింట్ల నష్టంతో 77,844 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 24,326 పాయింట్ల వద్ద ఫ్లాట్‌గా ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 25 పైసల మేర కోలుకొని, 94.24కు చేరింది. నిఫ్టీ సూచీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బజాజ్ ఆటో, ఎంఅండ్‌ఎం, గ్రాసిమ్, ఎన్టీపీసీ షేర్లు రాణించగా.. హెచ్‌యూఎల్, టీసీఎస్, టెక్ మహీంద్రా, టైటాన్ కంపెనీ, ఐటీసీ షేర్లు నష్టపోయాయి.









## హెల్త్‌కేర్, స్టాక్ బెనిఫిట్స్..

### స్వచ్ఛందంగా వైదొలిగే వారికి మైక్రోసాఫ్ట్ ఆఫర్

కృత్రిమ మేధపై విస్తృతంగా దృష్టిసారిస్తోన్న టెక్ కంపెనీలు ఈ ఏడాది కూడా ఉద్యోగుల కోతలను కొనసాగిస్తున్నాయి. ఈ క్రమంలోనే అమెరికా టెక్ దిగ్గజం మైక్రోసాఫ్ట్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ సంస్థలో సుదీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల కోసం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అవకాశాన్ని తీసుకొచ్చింది. ఈ ఆఫర్‌ను ఎంచుకునేవారికి మంచి ప్యాకేజీని కూడా ప్రకటించింది. ఇందులో హెల్త్‌కేర్ కవరేజీతో పాటు నగదు చెల్లింపులు, స్టాక్ ప్రయోజనాలను కల్పిస్తోంది. మైక్రోసాఫ్ట్ 50 ఏళ్ల చరిత్రలో స్వచ్ఛంద ఉద్యోగవిరమణ ప్రోగ్రామ్‌ను తీసుకురావడం ఇదే తొలిసారి. ఈ ప్రణాళిక గురించి కంపెనీ గత నెలలోనే వెల్లడించగా.. అందుకు సంబంధించిన పూర్తి వివరాలు తాజాగా బయటికొచ్చాయి. ఉద్యోగి వయసు, సర్వీసు కలిపి 70 ఏళ్లు దాటినవారు ఈ ఆఫర్‌ను వినియోగించుకోవచ్చు. అంటే.. ఉదాహరణకు ఉద్యోగి వయసు 50 ఏళ్లు ఉండి.. 20 ఏళ్లుగా కంపెనీలో పనిచేస్తున్నట్లయితే ఈ ఆఫర్‌కు అర్హులు. ఇలాంటివారు తమ కంపెనీలో 7శాతం మంది ఉన్నట్లు మైక్రోసాఫ్ట్ గతంలో వెల్లడించింది. 2025 జూన్ నాటికి అమెరికాలో సంస్థకు 1,25,000 మంది ఉద్యోగులున్నారు. అంటే 8,750 మందికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ అర్హత ఉన్నట్లు లెక్క. ఈ ఆఫర్‌ను ఉపయోగించుకునే వారికి పలు ప్రయోజనాలు లభించనున్నాయి. స్వచ్ఛంద పదవీవిరమణకు అంగీకరించే ఉద్యోగులకు ఐదేళ్ల పాటు కంపెనీ ఆరోగ్య సంరక్షణ అందివ్వనుంది. ఉద్యోగి సీనియార్టీ, ఎంతకాలం కంపెనీలో కొనసాగుతున్నారు? అనే అంశాలను ఆధారంగా చేసుకొని ఏకమొత్తంలో స్వచ్ఛంద ఉద్యోగవిరమణ భత్యాన్ని ఇవ్వనుంది. వీటితో పాటు స్టాక్ సంబంధిత ప్రయోజనాలను కూడా కల్పించనుంది. అర్హత కలిగిన ఉద్యోగులు 30 రోజుల్లోగా తమ నిర్ణయాన్ని వెల్లడించాలని కంపెనీ సూచించింది. ఈ ప్రోగ్రామ్ కోసం మైక్రోసాఫ్ట్ దాదాపు 900 మిలియన్ డాలర్లను కేటాయించింది. ఇక, మైక్రోసాఫ్ట్ త్వరలోనే లేఆఫ్‌లను కూడా ప్రకటించే అవకాశం ఉంది. రానున్న నెలల్లో ఉద్యోగుల కోతలు ఉండొచ్చని ఇటీవల సంకేతాలిచ్చింది. కొత్త నియామకాల విషయంలోనూ నెమ్మదిగానే ముందుకెళ్లే యోచనలో ఉన్నట్లు తెలిపింది. ఏఐ (కృత్రిమమేధ) పెట్టుబడులు, వ్యయనియంత్రణపై మరింతగా దృష్టిసారిస్తుండటం వల్లే.. కంపెనీ ఈ తొలగింపులు చేపట్టనున్నట్లు సమాచారం.



# ఆర్సీబీ పరాజయం





**ఆరు ఓటముల తర్వాత లఖ్‌నవూ విజయం**

**మార్ష్ మెరుపు శతకం.. విజృంభించిన ప్రిన్స్**

**లఖ్‌నవూ :** లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌కు కాస్త ఉపశమనం. వరుస ఓటములతో తల్లడిల్లిన ఆ జట్టు ఎట్టకేలకు విజయాన్నందుకుంది. వర్షం కారణంగా 19 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో 9 పరుగుల తేడాతో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరును ఓడించింది. మిచెల్ మార్ష్ (111; 56 బంతుల్లో 9x4, 9x6) మెరుపు శతకం బాదడంతో మొదట లఖ్‌నవూ 3 వికెట్ల నష్టానికి 209 పరుగులు చేసింది. పూరన్ (38; 23 బంతుల్లో 4x4, 1x6), పంత్ (32 నాటౌట్; 10 బంతుల్లో 4x4, 2x6) రాణించారు. డక్‌వర్త్ లూయిస్ విధానంలో లక్ష్యాన్ని 213 పరుగులకు సవరించగా ఛేదనలో ఆర్సీబీ తడబడింది. 6 వికెట్లకు 203 పరుగులే చేయగలిగింది. రజత్ పాటీదార్ (61; 31 బంతుల్లో 3x4, 6x6) టాప్ స్కోరర్. టిమ్ డేవిడ్ (40; 17 బంతుల్లో 4x4, 3x6) రాణించాడు. ప్రిన్స్ యాదవ్ (3/33), షాబాజ్ అహ్మద్ (2/33) ఆర్సీబీని దెబ్బతీశారు.


**బెంగళూరు తడబాటు:**

ఛేదనలో ఆరంభం ఆర్సీబీకి పెద్ద షాక్. 9 పరుగులకే ఓపెనర్లు బెతెల్ (4), కోహ్లి (0) నిష్క్రమించారు. బెతెల్‌ను షమి వెనక్కి పంపగా.. కోహ్లిని ప్రిన్స్ యాదవ్ బౌల్డ్ చేశాడు. ఆ దశలో కెప్టెన్ పాటీదార్, పడిక్కల్ నిలిచారు. పడిక్కల్ చక్కని షాట్లు ఆడాడు. నిలదొక్కుకోవడానికి సమయం తీసుకున్న పాటీదార్.. క్రమంగా చెలరేగిపోయాడు. ధనాధన్ షాట్లతో సిక్సులు బాదేస్తూ జోరుగా పరుగుల వేట సాగించాడు. దిగ్వేశ్ రాఠి, మయాంక్ యాదవ్ ఓవర్లలో రెండేసి సిక్సులు బాదాడు. పాటీదార్ 26 బంతుల్లోనే అర్ధశతకం సాధించాడు. 10 ఓవర్లలో 104/2తో ఆర్సీబీ బలమైన స్థితిలో నిలిచింది. అయితే ఆ జట్టు సాఫీగా లక్ష్యం దిశగా సాగుతున్న దశలో 8 పరుగుల వ్యవధిలో మూడు వికెట్లు పడగొట్టి లఖ్‌నవూ బలంగా పోటీలోకి వచ్చింది. పైచేయిలో నిలిచింది. ప్రిన్స్ ఒకే ఓవర్లో పడిక్కల్ (34), జితేశ్ శర్మలను ఔట్ చేసి ఆర్సీబీని గట్టి దెబ్బతీశాడు. జోరుమీదున్న పాటీదార్‌ను షాబాజ్ వెనక్కి పంపాడు. 112/5తో బెంగళూరు చిక్కుల్లో పడింది. ఆ తర్వాత ధనాధన్ ఇన్నింగ్స్ ఆడిన టిమ్ డేవిడ్‌ను 16వ ఓవర్లో షాబాజ్ ఔట్ చేశాడు. గెలవాలంటే ఆఖరి 3 ఓవర్లలో ఆర్సీబీ 47 పరుగులు చేయాల్సిన స్థితి. ఆ దశలో కృనాల్ విధ్వంసక బ్యాటింగ్‌తో లఖ్‌నవూను కలవర పెట్టాడు. కానీ ఆర్సీబీకి ఓటమి తప్పలేదు.

## ప్యాట్ కమిన్స్‌కు సీఏ నుంచి

# రూ.113 కోట్ల భారీ ఆఫర్

సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు భారీ ఆఫర్ వచ్చినట్లు వార్తలు వస్తున్నాయి. అతడికి రూ.113 కోట్లు (12 మిలియన్ డాలర్లు) ఇస్తామని క్రికెట్ ఆస్ట్రేలియా డీల్ కోసం ప్రయత్నిస్తోందని సమాచారం. మూడేళ్ల కాలానికి ఈ భారీ మొత్తం ఇవ్వనుంది. ఆస్ట్రేలియా తరఫున మూడు ఫార్మాట్లలో ఆడేందుకు ఒప్పందం చేసుకొనేందుకు చూస్తున్నట్లు సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ పేర్కొంది. అతడితోపాటు ట్రావిస్ హెడ్, మార్నస్ లబుషేన్‌తోనూ ఇలాంటి డీల్ చేసుకోవాలని భావిస్తుందట. ఓ ఐపీఎల్ ఫ్రాంచైజీ అంతర్జాతీయంగా గ్లోబల్ టీ20 లీగుల్లో తమ తరఫున ఆడేలా కమిన్స్‌కు 6.6 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.62 కోట్లు) ఆఫర్ ఇచ్చిందని.. ఈ నేపథ్యంలోనే క్రికెట్ ఆస్ట్రేలియా డీల్ చేసుకొనేందుకు చూస్తున్నట్లు కథనంలో పేర్కొంది. గతంలో విండీస్ ప్లేయర్లు టీ20 లీగ్‌ల కోసం వెళ్లడంతో.. జాతీయ జట్టు ఇబ్బందులు ఎదుర్కొంది. తమకు అలాంటి పరిస్థితి ఎదురుకాకూడదనే ఉద్దేశంలో క్రికెట్ ఆస్ట్రేలియా ఉన్నట్లు తెలుస్తోంది.



## అమెరికాలో భారత కంపెనీల

# భారీ పెట్టుబడులు

**వివిధ రంగాల్లో దాదాపు రూ.2 లక్షల కోట్లు పెట్టేందుకు ప్రణాళిక**

**న్యూఢిల్లీ :** అమెరికాలో సాంకేతికత, ఔషధ, తయారీ సహా వివిధ రంగాల్లో భారత కంపెనీలు 20.5 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.1,95,000 కోట్లు) పైగా పెట్టుబడులు పెట్టే యోచనలో ఉన్నాయని భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. పెట్టుబడుల ప్రతిపాదనలను ప్రస్తావిస్తూ.. భారత్-అమెరికా వ్యాపార సంబంధాల వల్ల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలో అమెరికాలోకి రికార్డు స్థాయిలో పెట్టుబడులు వస్తున్నాయని వెల్లడించారు. కాగా... సెలెక్ట్‌యూఎస్‌ఏ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సులో 12 భారత కంపెనీలు 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు (రూ.10,000 కోట్లు) పెట్టనున్నట్లు ప్రకటించాయి. సెలెక్ట్‌యూఎస్‌ఏలో ఒక గమ్యస్థానం నుంచి ఇప్పటివరకు వచ్చిన అత్యధిక పెట్టుబడుల ప్రతిపాదనలు ఇవే. మరోవైపు భారత్ కంపెనీల 20.5 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రణాళికలో ఈ 12 కంపెనీలు ప్రకటించిన 1.1 బిలియన్ డాలర్ల పెట్టుబడులు కూడా భాగమేనని గోర్ తెలిపారు. ఈ పెట్టుబడుల భాగస్వామ్యాలు అమెరికా పౌరులకు ఉద్యోగాలను సృష్టించడమే కాకుండా.. బలమైన సరఫరా వ్యవస్థల అభివృద్ధికి తోడ్పడతాయని వెల్లడించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశాలు కలిసి వ్యాపారాలు చేస్తే అందరూ విజేతలు కావొచ్చనడానికి ఇదే నిదర్శనమన్నారు. ఏరోస్పేస్, రక్షణ, ఇంధనం, కృత్రిమమేధ లాంటి రంగాల వ్యాప్తంగా ఈ పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని చెప్పారు.

- ఏఐ డేటా కేంద్రాల తయారీ సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు అమెరికాలో 100 మిలియన్ డాలర్లను స్టెర్‌లైట్ టెక్నాలజీస్ పెట్టుబడిగా పెట్టనుంది.
- భారత ఔషధ రంగ కంపెనీలు అమెరికాలో 19.1 బి.డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాలని అనుకుంటున్నట్లు ప్రకటించాయి. న్యూ జెర్సీకి చెందిన ఆర్గాన్ అండ్ కో. కొనుగోలుకు సన్‌ఫార్మా 11.75 బి.డాలర్లను వెచ్చించే యోచనలో ఉంది.
- ఒహాయో, టెక్సాస్‌లో ప్లాంట్ల వద్ద ప్రాజెక్టుల నవీకరణకు 255 మిలియన్ డాలర్లను పెట్టుబడి పెట్టాలని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్రణాళికగా పెట్టుకుంది.
- అమెరికాలోని ఐదు రాష్ట్రాల్లో తయారీ క్లస్టర్ల ఏర్పాటు నిమిత్తం అహ్మదాబాద్‌కు చెందిన అభ్యుదయ్ గ్రూపు అత్యధికంగా 900 మిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించింది.
- టెక్సాస్, మిసిసిపిలో 87 మిలియన్ డాలర్ల పెట్టుబడిని పీఆర్ జిందాల్ గ్రూపు పెట్టనుంది. జివో వెల్‌నెస్ గ్రూపు 15 మి.డాలర్లు, టెక్‌డోమ్ సొల్యూషన్స్ 7.5 మి.డాలర్లు, ఆట్రి ఏఐ 2 మి.డాలర్లు, మ్యాగ్నోఇన్నోవేషన్ ల్యాబ్ 2 మి.డాలర్లు, సటోరి ఎక్స్‌ఆర్ టీమ్ 1.5 మి.డాలర్లు, రోష్‌ఏఐ 5 మి.డాలర్లు, పాలీహోస్ ఇంక్ 2 మి.డాలర్లు, కినోఫ్లో 2 మి.డాలర్లు చొప్పున పెట్టుబడులను ప్రకటించాయి.
- అమెరికా విశ్వవిద్యాలయాలు, కళాశాలలతో పరిశోధన సహకారాన్ని పెంపొందించేందుకు కాలిఫోర్నియాలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ మద్రాస్ గ్లోబల్ రీసెర్చ్ ఫౌండేషన్ భావిస్తోంది. ఇందుకోసం 4.5 మిలియన్ డాలర్లను వెచ్చించనుంది.



## ఈ పాత్రకు నేను సరిపోలేదని అనిపించింది

నేచులర్ బ్యూటీ సాయి పల్లవి రీసెంట్‌గా బాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. అమిర్ ఖాన్ తనయుడు జునైద్ హీరోగా నటించిన 'ఏక్ దిన్' చిత్రం మే 1న ప్రేక్షకుల ముందుకు వచ్చి మొదటి షోతోనే నెగిటివ్ టాక్ తెచ్చుకుంది. ఈ చిత్రం డిజాస్టర్ అందుకోవడంతో సాయిపల్లవి బాలీవుడ్ ఎంట్రీపై కూడా విమర్శలు వచ్చాయి. అయితే.. ఈ సినిమాలో తన పాత్రకు తగిన న్యాయం చేయలేదని సాయి పల్లవి ముందే చెప్పిందట. అలాగే ఈ సినిమా ఎందుకు ఒప్పుకోవాల్సి వచ్చిదో ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. 'ఏక్ దిన్ స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. స్టోరీ చెప్పగానే ఓకే చెప్పేశాను. అయితే ప్రీమియర్ షో చూసిన తర్వాత ఈ పాత్రకు నేను సరిపోలేదని నాకు అనిపించింది. ఇదే మాట ఆమిర్ ఖాన్‌తో చెప్పా. 'ఈ పాత్రకు నన్ను కాకుండా మరొకరిని ఎంపిక చేసి ఉంటే బాగుండేదేమో. చురుగ్గా, హుషారుగా ఉండే కొత్త అమ్మాయిని ఎంపిక చేసి ఉండాల్సింది. వాళ్లు ఈ పాత్రకు బాగా న్యాయం చేసేవాళ్లు' అని నా మనసులో మాటను ఆమిర్తో చెప్పా' అన్నారు. సినిమా డిజాస్టర్ కావడంతో సాయి పల్లవి కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి.

## అగధ టీజర్ విడుదల

కామాక్షి భాస్కర్ల ప్రధానపాత్రలో నటించిన చిత్రం 'అగధ'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. విశ్వంలో ఎన్నో అతీత శక్తులు దాగున్నాయంటూ ప్రారంభమైన ఈ టీజర్ సినిమాపై ఆసక్తి కలిగిస్తోంది. 'అగధ' ముందు ఎవరి ఆటలు సాగవంటూ చెప్పే డైలాగ్ పాత్ర ప్రాధాన్యతను తెలియచేస్తోంది. ప్రతిక్షణం ప్రేక్షకుడికి ఉత్కంఠ కలిగించాలన్నదే తన ప్రయత్నమని డైరెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు. విజువల్ ఎఫెక్ట్స్, గెటప్స్, ఆ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ , భయం గొలిపే లొకేషన్లు, విచిత్రమైన ఎక్స్‌ప్రెషన్స్ , మధ్య మధ్యలో ఆసక్తి రేకెత్తించే డైలాగ్స్ ఆకట్టుకు ంటున్నాయి. 'ఆ వీడియోలో నువ్వు ఏం చూసావమ్మా' అని అడిగితే, ఒక అమ్మాయి భయంతో వణికిపోతూ 'అగ్... అగ్... అగధ' అని చెప్పడంతో 'అగధ' అంటే ఎవరు అనే ఆసక్తి కలుగుతుంది. 'అగధ' వచ్చేసిందమ్మా. 'అగధ' ముందు ఎవ్వరి ఆటలు సాగవు. రా... 'అగధా? రా'అంటూ వినిపించే డైలాగ్స్ తో టీజర్ తాలూకు ఉత్కంఠ పీక్ లెవెల్ కి చేరినట్టుగా అనిపిస్తుంది. త్వరలో ట్రైలర్ ను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.




# పెద్ది ఎడిటింగ్ వర్క్ పూర్తి

### జూన్ 4న విడుదలకు రంగం సిద్ధం

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ డైరెక్టర్ బుచ్చి బాబు సాన కాంబినేషన్‌లో వస్తున్న పెద్ది గురించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఈ చిత్ర ఎడిటింగ్ వర్క్ పూర్తయినట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. ఈ సినిమా అవుట్‌పుట్ చిత్ర బృందం ఎంతో సంతృప్తిగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా జూన్ 4న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జూన్ 4న విడుదల కానున్నప్పటికీ, అంతకంటే ఒకరోజు ముందే అంటే జూన్ 3న భారీ స్థాయి-ంలో ప్రీమియర్ షోలు ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. శివరాజ్ కుమార్, జగపతి బాబు, బోమన్ ఇరానీ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ మరియు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఓవర్సీస్‌లో మే 7 రాత్రి నుంచి 'పెద్ది' అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నట్లు నిర్మాణ సంస్థ తెలిపింది. విడుదల తేదీ దగ్గరపడుతుండడంతో టీమ్ ప్రచారం జోరు పెంచింది. తాజాగా సినిమా ఆర్ట్ డైరెక్టర్ అవినాశ్ కొల్లా పాల్గొని, పెద్ది గురించి పలు విశేషాలు పంచుకున్నారు. 'పెద్ది'లో 70-80ల మధ్య విజయనగరం బ్యాక్‌డ్రాప్ ఉంటుందన్నారు. పొలం గట్టుపై కూర్చొని క్రికెట్ చూస్తే ఎలాంటి ఫీలింగ్ కలుగుతుందో.. ఈ సినిమా చూసినా అదే ఫీలింగ్ కలుగుతుందన్నారు. మరోవైపు త్వరలోనే దీని ట్రైలర్ రానున్నట్లు వార్తలు వస్తున్నాయి.






## ఓటిటిలోకి తిమ్మరాజుపల్లి టీవీ

హీరో కిరణ్ అబ్బవరం నిర్మించిన చిత్రం 'తిమ్మరాజుపల్లి టీవీ'. సాయితేజ్, వేద జలంధర్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై అందరికీ బాల్యంలోని జ్ఞాపకాలను గుర్తుచేసింది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ప్రేక్షకుల ముందుకువచ్చేందుకు సిద్ధమైంది. మే 15 నుంచి ఆహా వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని అధికారికంగా తెలుపుతూ ఆహా పోస్టర్ విడుదల చేసింది. కొత్త నటీనటులను పరిచయం చేస్తూ వి.మునిరాజ్ ఈ సినిమాను తెరకెక్కించారు. టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం. తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొ÷-టటె). ఆ ఊళ్లో చిల్లర దొంగత నాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదేరోజు రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అన్నది మిగిలిన కథ.

### శంబాల డైరెక్టర్‌తో

## సందీప్ కిషన్ మూవీ




టాలెంటెడ్ నటుడు సందీప్ కిషన్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు చిత్ర బృందం అదిరిపోయే కానుకను అందించింది. సందీప్ కెరీర్‌లో 33వ చిత్రంగా అత్యంత భారీ స్థాయిలో రూపొందనున్న కొత్త ప్రాజెక్ట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇటీవల 'శంబాల' చిత్రంతో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు యుగంధర్ ముని ఈ చిత్రానికి దర్శకత్వం వహించబోతున్నాడు. ఇదొక సోషియో-ఫాంటసీ, మైథాలజికల్ అడ్వెంచర్ డ్రామాగా తెరకెక్కనుంది. 'మౌనంగా జన్మించాడు.. కాలాలను జయించేందుకు సిద్ధమయ్యాడు' అనే అర్థం వచ్చేలా విడుదల చేసిన ఈ చిత్ర అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఈ పోస్టర్‌లో సింహం ఒక చిన్నారిని చూస్తూ గంభీరంగా కనిపిస్తుండగా, మధ్యలో ఉన్న కత్తి సినిమా నేపథ్యాన్ని ప్రతిబింబిస్తోంది. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్‌పై రాజశేఖర్ అన్నభీమోజు, మహిధర్ రెడ్డి ఈ పాన్-ఇండియా చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో కూడా ఈ సినిమా విడుదల కానుంది. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, ఈ ఏడాది ఆగస్టు నుంచి రెగ్యులర్ షూటింగ్‌కు వెళ్లనుంది.



## నాకు తెలుగు అబ్బాయే కావాలి

### పాయల్ రాధాకృష్ణ

'పాపం ప్రతాప్' ఫేం పాయల్ రాధాకృష్ణ, 'ఈషా' ఫేమ్ త్రిగుణ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'మిస్టర్ వర్క్ ఫ్రమ్ హోమ్'. మధుదీప్ చెలికాని రచన, దర్శకత్వం వహించిన ఈ చిత్రం అరవింద్ మండెం నిర్మించారు. ఇందులో నుంచి ఇప్పటికే వచ్చిన టీజర్, ట్రైలర్, పాటలకు పాజిటివ్ రెస్పాన్స్ రాగా.. మే 15న సినిమా గ్రాండ్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు రానుంది. ఈ క్రమంలోనే తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించారు. ఇందులో పాల్గొన్న హీరోయిన్ పాయల్ రాధాకృష్ణ తన పెళ్లిపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. 'నాకు నిజంగా తెలుగు అబ్బాయే కావాలి. నా హార్ట్, మైండ్ అంతా ఇక్కడే ఉన్నాయి. నేను నిజంగా హార్ట్ ఫుల్‌గా చెబుతున్నా నాకు వర్క్ ఇచ్చింది, ఫేస్ వ్యాల్యూ ఇచ్చింది, డబ్బుల ఇచ్చింది, పీస్ ఇచ్చింది, అన్నీ హైదరాబాద్, తెలుగు ఆడియన్సే. నాకు అన్నీ ఇక్కడే ఉన్నాయి. నేను లైఫ్‌లో చేసింది అంతా ఇక్కడే ఉంది. కాబట్టి నేను హైదరాబాద్‌ను, తెలుగును వదిలే ప్రసక్తే లేదు' అని చెప్పుకొచ్చింది.

## కార్తీతో మ్యాడ్ డైరెక్టర్ మూవీ

తమిళ స్టార్ హీరో కార్తీ, టాలీవుడ్ యంగ్ డైరెక్టర్ కళ్యాణ్ శంకర్ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతుందనే విషయం తెలిసిందే. తాజాగా ఈ క్రేజీ ప్రాజెక్ట్ హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైనట్లు తెలుస్తుంది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం పూజా కార్యక్రమంతో అధికారికంగా పట్టాలెక్కింది. టాలీవుడ్‌లో 'మ్యాడ్' ,'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలతో సూపర్ హిట్స్ అందుకున్న దర్శకుడు కళ్యాణ్ శంకర్, ఇప్పుడు హీరో కార్తీతో ఒక భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌ను ఎ÷-లాన్ చేశారు. ఈ సినిమాలో కార్తీ సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించబోతుంది. నేడు హైదరాబాద్‌లో జరిగిన ముహూర్తపు వేడుకలో చిత్ర యూనిట్ సభ్యులు మరియు పలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నట్లు సమాచారం. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీకి తెలుగులో ఉన్న క్రేజ్, కళ్యాణ్ శంకర్ మార్క్ హ్యూమర్ తోడవడంతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సందడి చేయడం ఖాయమని ఫ్యాన్స్ భావిస్తున్నారు.



Udayam :- printed.Editor ,Pblished and owendBy M.chandrasekher.plat no12journalistcolany.near B.t.r.Nagar.vartha office Back said
k.g.Road.kurnool.andrapradesh.pin518001.Printed At Uttejitha printers.Kurnool.Ap cell.9000313849. RNI Aptel2015/62159.